# ఏకలవ్య గురుకుల పాఠశాలలో దారుణం

**- విద్యార్థులను కొట్టి గాయపరిచిన ఉపాధ్యాయుడు**



గాయపడిన విద్యార్థులు

ఓజిలి, డిసెంబర్ 7 ప్రభాతవార్త

ఓజిలిలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు 20 మంది విద్యార్థులను కొట్టి గాయపరిచిన దారుణ సంఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి చేసిన పొరపాటును గమనించిన ఉపాధ్యాయుడు అరుణ్ 7వ తరగతి చదువుతున్న సుమారు 20 మంది విద్యార్థులను చెట్లకు నీరు పట్టే డ్రిప్ పైపుతో విచక్షణా రహితంగా కొట్టాడు. ఈ ఘటనలో విద్యార్థులు గాయపడ్డారు. దీనిపై సమాచారం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు గురుకుల పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయుడిపై ఓజిలి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన విద్యార్థులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




# కల్వర్టును ఢీకొట్టిన కారు

## ఆరుగురికి గాయాలు

చంద్రగిరి, డిసెంబర్ 7 ప్రభాతవార్త:



కల్వర్డును కారు ఢీకొట్టిన ఘటన ఆదివారం వేకువజామున అగరాల సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రైల్వే కోడూరుకు చెందిన సాయికుమార్, యోగేష్, మణికంఠ, అజయ్‌కుమార్, జస్వంత్, నితీష్ శబరిమలై వెళ్ళి స్వామివారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో వస్తుండగా డ్రైవర్ క్షణకాలం నిద్రమత్తుకు గురికావడంతో కారు అదుపుతప్పి చంద్రగిరి - అగరాల మధ్యన కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికుమార్ (25) తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి జారుకున్నాడు. మిగిలిన 5 మందికి గాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను 108 ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

# ఆలయ ప్రాశస్థ్యాన్ని నలుదిశలా వ్యాపింపజేయాలి

**ఆట్టహాసంగా పాలకమండలి ఆత్మీయ అభినందన సభ**



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యేలు మురళీమోహన్, గురుజాల జగన్మోహన్, సభకు హాజరైన అభిమానులు, నూతన ఛైర్మన్ మణినాయుడు, ఎమ్మెల్యేను భారీ గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

కాణిపాకం, డిసెంబర్ 7 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి ఆలయ ప్రాశస్థ్యాన్ని నలు దిశలా వ్యాపింపజేయడానికి నూతన పాలక మండలి చిత్తశుద్ధితో కృషి చేయాలని పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్మోహన్‌లు దిశా నిర్దేశం చేశారు. నూతనంగా ఏర్పాటై పదవీ ప్రమాణ స్వీకారం చేసిన దేవస్థానం పాలకమండలి ఆత్మీయ అభినందన సభ దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ఆధ్యక్షతన ఆట్టహాసంగా జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్మోహన్‌లతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ దినదినాభివృద్ధి చెందుతున్న కాణిపాకం ఆలయ ప్రాశస్థ్యాన్ని ప్రపంచ వ్యాపంగా వ్యాపింపజేయడానికి నూతన పాలకమండలి ఛైర్మన్ మణి నాయుడు ఆధ్వర్యంలో సభ్యులు కృషి చేయాలని సూచించారు. దేవస్థానంకు సంభందించి 14 గ్రామాలకు చెందిన ఉభయదారులు ఉన్నప్పటికి ఆలయ అభివృద్దిని దృష్టిలో వుంచుకుని ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన పలు ప్రాంతాల నుంచి కూటమి పార్టీలకు చెందిన వారికి పాలక మండలిలో చోటు కల్పించినట్లు తెలిపారు. స్వామివారు కల్పించిన ఈమహత్తర అవకాశాన్ని భక్తుల సేవలో తరించడంతో పాటు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చే భక్తుల సౌకర్యాల కల్పనకు చిత్తశుద్దితో కృషి చేయాలని కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్మోహన్‌లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం తన సొంత నిధులతో తన తండ్రి గురుజాల చెన్న కేశవులు నాయుడు పేరిట హోమ మండపం నిర్మిస్తామని ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ నాయుడు ప్రకటించారు. అలాగే భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో వుంచుకుని దేవస్థానం దాతల సహకారంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని పలువురు సూచించారు. ఈసందర్భంగా పాలక మండలి ఛైర్మన్ మణినాయుడు మాట్లాడుతూ తనకు ఉభయదారుడిగా ఆలయంపై అవగాహన వుందని తెలిపారు. పెద్దలు, ఉభయదారుల సూచనలు, సలహాలతో ఆలయ అభివృద్ధికి తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. ఈసందర్భంగా నూతన పాలకమండలి ఛైర్మన్ మణినాయుడు, సభ్యులను పలువురు ప్రముఖులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్,ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్,రాష్ట్ర హస్త కళల సంస్థ ఛైర్మన్ బోత్ హరిప్రసాద్, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, చుడా ఛైర్మన్ కఠారి హేమలత, టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి దేవస్థానం ఛైర్మన్ కొట్టే సాయి,పాలకమండలి సభ్యులు కత్తి సుధాకర్‌రెడ్డి,చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ బివి.నరేష్, చంద్రకళ, కెఎస్.అనుసూయమ్మ, సంధ్యారాణి, సునీత, కొత్తపల్లె శివప్రసాద్, టివి.రాజ్యలక్ష్మి, ఊట్ల నాగరాజు నాయుడు,శ్రీపతి సతీష్, పెరుమాళ్ సుబ్రమణ్యంరెడ్డి, చల్లా కృష్ణవేణి, పద్మలత, వసంత, వి.శ్రావణిలతో పాటు పలువురు స్థానిక నాయకులు మధుసూదన్‌రావు, ఎల్‌బి.నాయుడు, లత, జయచంద్ర, హేమాద్రి నాయుడు, ప్రజా ప్రతినిధులు, ఆలయ అధికారులు, ఉభయదారులు పాల్గొన్నారు.

# పోలియో చుక్కలు...!

# డిఎంహెచ్ఓ ఆఫీసు సిబ్బందికి కాసులు...!

**- గత పోలియో చుక్కల నిధులు స్వాహా**

**ఒక్క చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే రూ.1.50 లక్షలు నిధులు హాంఫట్**

**నిధులు స్వాహా చేసిన వారితోనే డ్యూటీలు చేయించుకోవాలని ప్రశ్నిస్తున్న ఎఎన్ఎంలు**

చిత్తూరు, డిసెంబర్ 7 ప్రభాతవార్త:



దేశంలోని చిన్నారి పిల్లలకు పోలియో సోకకుండా ప్రతి ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోలియో చుక్కల కార్యక్రమం చిత్తూరు జిల్లాలో అభాసుపాలవుతోంది. పల్స్ పోలియో చుక్కల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న పారితోషకంను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వారికి దక్కనీయ్యడం లేదు. పల్స్ పోలియో చుక్కలు కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయిలో 3 రోజుల పాటు కష్టపడి విధులు నిర్వహిస్తున్న ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లకు ఎలాంటి పారితోషకం ఇవ్వకుండా పోలియో చుక్కల కార్యక్రమ విధుల్లో ఎలాంటి విధులు నిర్వ ర్తించని డిఎంహెచ్ఓ కార్యాలయ సిబ్బంది ఈ నిధులను స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. గత ఏడాదిలో నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమానికి సంబంధించి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సూపర్‌వైజర్లకు చెల్లించాల్సిన మొత్తాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇప్పటి వరకు చెల్లించలేదు. పోలియో చుక్కల కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుండి క్షేత్ర స్థాయిలో 3 రోజుల పాటు కష్టపడి విధులు నిర్వర్తిస్తున్న తమకు పారితోషికం ఇవ్వకుండా ఎలాంటి విధులు నిర్వర్తించని అధికారులు ఈ నిధులను స్వాహా చేస్తున్నారని గ్రహించిన సిబ్బంది ఈ నెలలో జరిగే పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమ విధుల్లో పాల్గొనమని ఉన్నత అధికారులకు స్పష్టం చేయడంతో ఈ వ్యవహారం బహిర్గతం అయ్యింది. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 110 పల్స్ పోలియో చుక్కల కేంద్రాలు వున్నాయి. ఈ కేంద్రాల్లో గత ఏడాది పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో విధులు నిర్వర్తించిన సిబ్బందికి 1.10 లక్షల రూపాయల మేరకు నిధులు చెల్లించాల్సి వుంది. అలాగే పోలియో చుక్కల ప్రచార కార్యక్రమం, మైక్‌లు తదితరాలకు చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.40 లక్షలు చెల్లించాల్సి వుంది. గత ఏడాది 2024 మార్చి 3వ తేదీ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం జరిగితే ఈ నిధులను ఇప్పటి వరకు సిబ్బందికి చెల్లించని పరిస్థితి నెలకొంది. పోలియో మహమ్మరిని దేశం నుండి తరిమికొట్టాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పల్స్ పోలియో చుక్కల కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి దేశ వ్యాప్తంగా ఒకే రోజు పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహిస్తోంది. 0-5 సంవత్సరాల మధ్య వున్న పిల్లలకు మొదటి రోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన పల్స్ పోలియో చుక్కల కేంద్రాల్లో తల్లిదండ్రులు పిల్లలను తీసుకెళ్ళి పోలియో చుక్కలు వేయించుకోవాలి. ఈ పోలియో చుక్కల కేంద్రంలో ఎఎన్ఎం, అంగన్‌వాడీ వర్కర్, ఆశా వర్కర్, సూపర్‌వైజర్ వుంటారు. ఆ తరువాత రెండు రోజుల పాటు ఎఎన్ఎం, ఆశా వర్కర్లు పోలియో చుక్కలు వేయించుకోని పిల్లల ఇంటి వద్దకు వెళ్ళి వారికి పోలియో చుక్కలు వేయించి వంద శాతంకు పైగా పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించినట్లు చూపించాల్సి వుంటుంది. పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం ప్రారంభరోజు నుండి 3 రోజుల పాటు ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు క్షేత్ర స్థాయిలో కష్టపడి విధులు నిర్వర్తిస్తారు. కేంద్ర ప్రభుత్వం ఒకొక్క పల్స్ పోలియో కేంద్రంకు రూ.1000 నిధులు మంజూరు చేస్తోంది. అలాగే ప్రతి పిహెచ్‌సి పరిధిలో పోలియో చుక్కల కార్యక్రమం ప్రచారం నిర్వహించడానికి, మైకులు ఉపయోగించుకోవడానికి మరో రూ.3 వేల రూపాయలు మంజూరు చేస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం ప్రచారం కోసం వెచ్చించిన నిధులను డిఎంహెచ్ఓ కార్యాలయ అధికారులు ఒకవేళ మంజూరు చేస్తే వాటిని పిహెచ్‌సి స్థాయిలో వాటాలు వేసుకుని పంచుకుంటున్నారు. ఒకవేళ డిఎంహెచ్ఓ కార్యాలయ అధికారులు ఈ నిధులు విడుదల చేయకుండా అక్కడే స్వాహా చేస్తుంటారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం ఈ కార్యక్రమంలో విధులు నిర్వర్తించే సిబ్బందికి నిధులు ఇవ్వకపోగా ఎలాంటి పనులు చేయని వారి జేబులకు నిధులు వెళ్ళి చేరుతుండటంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సారైనా పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంను పక్కాగా నిర్వహించి క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించిన సిబ్బందికి సకాలంలో నిధులు ఇస్తారని ఆశిద్దాం.

# జనంలో వెళ్లండి.. చేస్తున్న మంచి చెప్పండి : సిఎం చంద్రబాబు

## కుప్పం పార్టీ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్‌లో సిఎం



కుప్పం, డిసెంబర్ 7 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో తెదేపా నేతలు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలని తెదేపా జాతీయ అధ్యక్షులు, సిఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఆదివారం ఆయన కుప్పం పార్టీ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా సిఎం మాట్లాడుతూ కుప్పంను అభివృద్ధి చేసే బాధ్యత తనది అని పేర్కొన్నారు. ఏడాదిన్నర కాలంగా కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచి గురించి ప్రజలకు తెలియజేసేబాధ్యత పార్టీ నాయకులపై ఉందని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సూపర్‌సిక్స్ పథకాలను సూపర్‌హిట్ చేశామని పేర్కొన్నారు. ఈ విషయాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని, ప్రజలతో నాయకులు సత్సంబంధాలు కలిగి ఉండాలని సూచించినట్లు సమాచారం. కుప్పానికి వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలు వస్తున్నాయన్నారు. వీటి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మరిన్ని పరిశ్రమలు కుప్పంవైపు చూస్తున్నాయని పేర్కొన్నట్లు సమాచారం. అతిత్వరలోనే కుప్పంలో ఎయిర్‌పోర్టు నిర్మాణంకు సైతం చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారని తెలిసింది. కుప్పానికి చక్కటి రోడ్ కనెక్టివిటీ సైతం చేస్తున్నట్లు చెప్పారు. పలమనేరు -కృష్ణగిరి జాతీయ రహదారి ఫోర్‌లైన్ విస్తరణకు డిపిఆర్ సిద్ధమైందని పేర్కొన్నారు. పార్టీలో నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఇంకనూ పలు విషయాలపై సిఎం చంద్రబాబు నేతలు, కార్యకర్తలతో చర్చించినట్లు తెలిసింది.

### వీర మరణం పొందిన

# సైనికుల కుటుంబాలకు ఫ్లాగ్ డే నిధులు

**- కలెక్టర్ సుమిత్‌కుమార్**



ఫ్లాగ్ డే ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరుహెల్త్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:

దేశ భద్రత కోసం సరిహద్దుల్లో వర్షం, చలికి తట్టుకుని సేవలు అందించి, దేశ రక్షణలో వీర మరణం పొందిన సైనికులు, మాజీ సైనికుల కుటుంబ సంక్షేమాలకు ఫ్లగ్‌డే విధులు జమ అవుతాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. చిత్తూరులో జిల్లా మాజీ సైనికుల సంక్షేమ అధికారి రాఘవులు ఆధ్వర్యంలో ఆదివారం త్రి సాయుధ దళాల పతాక దినోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రాఘవులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు పతాకం పిన్ చేసి ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే హుండీ డ్రైవ్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ దేశ భద్రత కోసం త్రి సాయుధ దళాలు అందిస్తున్న సేవలు అపూర్వమైనవన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడానికి ఫ్లాగ్ డే ఎంతో ప్రాముఖ్యమైనదన్నారు. ఫ్లాగ్ డే నిధులు మాజీ సైనికులు, వీర మరణం పొందిన సైనికుల కుటుంబాల సంక్షేమానికి వినియోగించబడుతాయని దీనికి ప్రజలు మరింత సహకరించాలని పిలుపునిచ్చారు. జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రాఘవులు మాట్లాడుతూ త్రి సాయుధ దళాలు దేశానికి గర్వకారణమని, వారి కుటుంబాలను నిలబెట్టడం కోసం సమాజం నుండి అందుత్ను సహకారం అమూల్యమైనదని అభిప్రాయపడ్డారు. ఈ హుండీ డ్రైవ్ కార్యక్రమంను జిల్లాలోని అన్ని విభాగాలు, సంస్థలు, విద్యాసంస్థల వరకు విస్తరించనున్నట్లు జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రాఘవులు తెలిపారు.

# పార్టీకి పనిచేసిన తెలుగు తమ్ముళ్లు కష్టాల్లో ఉన్నారు.. ఆదుకోండి

## సిఎంకు రెడ్డివారి గురువారెడ్డి వినతి



సిఎంకు నియోజకవర్గ సమస్యలను వివరిస్తున్న రెడ్డివారి గురువారెడ్డి

శ్రీకాళహస్తి, డిసెంబర్ 7 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ పార్టీకి పునాదులుగా పనిచేసే తెలుగుదేశం తమ్ముళ్ళు కష్టాల కడగండ్లు మింగుతూ జీవనం గడుపుతున్నారు.. ఆదుకోవాల్సింది మీరే అంటూ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలసి తమ బాధలను మొరబెట్టుకున్నారు. మంగళగిరిలోని పార్టీకార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును, రెడ్డివారి గురువారెడ్డి కలసి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పార్టీ కోసం ఆది నుంచి పనిచేస్తూ నేడు కష్టాలు ఎదుర్కొంటూ కన్నీళ్లు దిగమింగుతూ జీవనం సాగిస్తున్నారని వివరించినట్లు తెలిసింది. 2014-2019 మధ్య పార్టీ ఆదేశాలతో అప్పటి నాయకుల ప్రోత్సాహంతో నియోజకవర్గంలో పార్టీ విధేయులు నీరుచెట్టు పనులు చేసారు. వారికి ఇంకా సుమారు రూ.3కోట్లు చెల్లించాల్సి ఉందని, అలాగే ఎన్ఆర్‌జిఎస్,ఎస్‌టి,ఎస్‌సి సబ్‌ప్లాన్‌లో పనులు చేసి చెల్లింపుల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ముఖ్యమంత్రికు వివరించారు. మరి ఆనాడు పార్టీ పిలుపు మేరకు పనులు చేసిన వారు తాము ఇబ్బందుల్లో ఉన్నా 2024 ఎన్నికల్లో మళ్ళీ పార్టీని అధికారంలోకి తీసుకురావటానికి వైకాపా నాయకులు ఎన్ని ఇబ్బందులు కల్గించినా, పోలీసులచే భయపెట్టినా లెక్క చేయక పని చేసారని, ముఖ్యమంత్రి దృష్టికి తెస్తూ పనులు చేసి తిప్పలు పడుతున్న కార్యకర్తలను ఆదుకోవాలని కోరారు. కాగా 2019-24లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు,ద్వితీయశ్రేణి నాయకులపై వైకాపా నాయకులు తప్పుడు కేసులు బనాయించారని వారు నేటికి కోర్టుల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారని వారిని కేసుల నుంచి కాపాడాలని కోరారు. దీనిపై సిఎం స్పందిస్తూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నీరు చెట్టు పనులు చేసి ఇబ్బందులు పడుతున్న కార్యకర్తల సమస్యను గురువారెడ్డి వివరించినపుడు ఆయన వెంటనే అక్కడున్న అధికారులకు ఆ వివరాలను తెప్పించాలని, తాను పాత బకాయిలు చెల్లించేందుకు ఆదేశించినాను కదా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. మరియు సిఎం సూచనలు చేస్తూ 'పార్టీ ఉంటేనే మనం ఉంటాము.' మనకు తిరుగులేని బలం ఉందని ప్రజల్ని గాలికి వదలిపెట్టవద్దు. వారు ఎదుర్కొనే ప్రతి సమస్యను గుర్తించి నియోజకవర్గ నాయకుని దృష్టికి తీసుకురావాలి.అలాగే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలి. జనం మన మీద నమ్మకంతో తిరుగులేని మెజారిటి అందించారు.వారి మనోభావాలకు అనుగుణంగా పని చేయాలని గురవారెడ్డికి సూచించినట్లు సమాచారం.

# గూడూరును జిల్లా చేయాలి

**టవర్ క్లాక్ సెంటర్లో రిలే దీక్షలు - తొలి రోజు భారీగా కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాలు**





గూడూరు, డిసెంబర్ 7, ప్రభాతవార్త

గూడూరును జిల్లా కేంద్రం చేయాలని, లేని పక్షంలో నెల్లూరు జిల్లాలో కలపాలని జేఏసీ కన్వీనర్ దశరథరామి రెడ్డి కోరారు. గూడూరు పట్టణంలోని గడియారం స్థంభం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో రిలే దీక్షలను ప్రారంభించారు. గూడూరును జిల్లా చేయాలంటూ గత కొద్ది రోజులుగా నియోజకవర్గ స్థాయిలో నిరసనలు జరుగుతున్నాయి. అన్నీ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ప్రజలు తమ వంతు మద్దతు ప్రకటించారు. ఈ క్రమంలో భాగంగా పట్టణంలోని గడియారం స్థంభం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఆదివారం జేఏసీ ప్రతినిధులతో పాటు ఉద్యోగులు, స్వచ్ఛంధ సంస్థలు, ప్రజా సంఘాలు, మీడియా ప్రతినిధులు, దళిత, మైనారిటీ సంఘాల నాయకులు దీక్షలో పాల్గొన్నారు. గూడూరును జిల్లా కేంద్రం చేయాలంటూ వారు నినదించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ దశరథరామి రెడ్డి మాట్లాడుతూ గూడూరును జిల్లా కేంద్రం చేయాలన్నారు. లేని పక్షంలో నెల్లూరు జిల్లాలో కలపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. తిరుపతి జిల్లాలో కలిపినందు వల్ల నియోజకవర్గ ప్రజలు అవస్థలు పడుతున్నారని, గత ఎన్నికల ప్రచారంలో గూడూరుకు వచ్చిన ప్రస్తుత సీఎం చంద్రబాబు గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సీఎం ఇచ్చిన హామీని నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు చిరువెళ్ల సునీల్, షేక్ జమాలుల్లా, నాగేశ్వర రావు, శంకర్ రెడ్డి, వేగూరు రాజేంద్ర ప్రసాద్, విజయకుమార్, భాస్కర్ గౌడ్, శ్రావణ్ కుమార్, రవి, సునీల్, నారాయణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అట్ల రవి, శివ రామిరెడ్డి, షేక్ బాబు, జైపాల్ రెడ్డి, మీడియా ప్రతినిధులు ఉడతా శరత్ యాదవ్, బాబు మోహన్ దాస్, స్వామి, రసూల్, కిషోర్ కుమార్, వెంకటయ్య, ఆత్మకూరు సురేష్, నిరంజన్, సుభాన్, శ్రీనివాసచారి, నాగు, నాగరాజు, బీజేవైఎం రాష్ట్ర నాయకులు మనోజ్ కుమార్, ఏఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ షఫి హరన్, మైనారిటీ నాయకులు షేక్ ఇబ్రహీం, ఆర్టీసీ యూనియన్ నాయకులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఇ'న్‌స్టాల్‌మెంట్‌లో 'ఈ' సైకిళ్లు

**- కుప్పం ప్రజలకు కడ ద్వారా బంపర్ ఆఫర్.. 5వేల డిపాజిట్‌తో సైకిల్ !!**



కుప్పం, డిసెంబర్ 7 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా వందశాతం సోలరైజేషన్‌కు చర్యలు చేపట్టారు. అదే విధంగా నియోజకవర్గ ప్రజలకు ఉపయుక్తంగా పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు గాను పెద్ద ఎత్తున రాయితీతో ఈ సైకిళ్లు అందించేలా ఆదేశించారు. కుప్పం ఏరియాడెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ద్వారా ఇదివరకే సుమారు 800దాకా ఇ - సైకిళ్లను చిరువ్యాపారులు, డ్వాక్రా సంఘాల మహిళలకు అందజేశారు. ఇప్పుడు మరో మారు కడ ద్వారా ప్రజలకు ఈ - సైకిళ్లను రాయితీతో అందించేలా నిర్ణయించారు. ప్రజలు, లేదా ఉద్యోగులు ఎవరైనా ఈ - సైకిళ్లను ఒకేసారి మొత్తం ధర చెల్లించకుండా డిపాజిట్ సొమ్ము, అనంతరం ఇన్‌స్టాల్‌మెంట్ రూపంలో ప్రతినెలా అప్పు తీరే దాకా చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టారు. మహారాష్ట్రకు చెందిన ఇ- మోటరాడ్ సంస్థ ఈ ఇ-సైకిళ్లను రాయితీతో అందించేందుకు ముందుకు వచ్చింది. ప్రముఖ క్రికెటర్ ఎం.ఎస్. ధోనీ ఈ బ్రాండ్‌కు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నారు. ఒక ఇ - సైకిల్ ధర మార్కెట్లో 37వేలు పలుకుతోంది. హోల్‌సేల్ ధర 31వేలుగా నిర్ణయించారు. కుప్పం ప్రాంత ప్రజలకు కేవలం 24వేలకు ఈ సైకిల్‌ను దక్కించుకోవచ్చు. మగవారు, ఆడవారికి వేర్వేరు మోడల్స్ ఉన్నాయి. ఒకసారి సాధారణ ప్లగ్‌తో చార్జింగ్ చేస్తే 40కి.మీ.ల మైలేజ్ వరకు నడపవచ్చు. ఇదిలా ఉంటే ఈ సైకిల్‌ను సొంతం చేసుకోవాలంటే తొలుత దరఖాస్తు చేసుకోవడంతో పాటు రూ 5వేల నగదు డౌన్‌పేమెంట్ చేయాల్సి ఉంటుంది. అనంతరం నెలనెలా రూ 890లు చెల్లించాలి. ఈ - సైకిళ్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకై మండల కేంద్రాలు, కడ కార్యాలయం వద్ద డెమో ప్రదర్శనలు ఇస్తున్నారు.

## బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



చిత్తూరు, డిసెంబరు 7 ప్రభాతవార్త జిల్లాలోని తవణంపల్లి మండలం ఈచనేరి గ్రామంలో స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు కృష్ణమనాయుడు, పార్ధసారధిల ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా నాయకులు పార్ధసారధి మాట్లాడుతు తమ గ్రామంలోని బాధితుడు జగదీష్ కుమార్తె లాస్యరెడ్డికి రూ.లక్ష రూపాయల చెక్కును అందించటం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు సేవ చేయటంలో, బాధితులను ఆదుకోవటంలో ముందు వరుసలో ఉంటుందన్నారు. తాము కోరిన వెంటనే బాధితులకు సహాయనిధి ద్వారా చెక్కులను అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖమంత్రి నారాలోకేష్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ చిట్టిబాబు, నాయకులు యువరాజు స్వేరో, అనిల్‌కుమార్, యుగంధర్, సురేష్‌బాబు, జయబాబు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కల్లూరు, డిసెంబర్ 7, ప్రభాతవార్త



పులిచెర్ల మండలం దేవళం పేట శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శివయ్యకు ఆరుద్ర నక్షత్రం చాలా శ్రేష్టకరం. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణి ప్రకాష్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి

కల్లూరు, డిసెంబర్ 7, ప్రభాతవార్త

ఐసిడిఎస్ ప్రాజెక్టు పులిచెర్ల పరిధిలోని జడ్పిహెచ్ఎస్ నందు సిడిపిఓ వాణి శ్రీ దేవి ఆధ్వర్యంలో బాల్య వివాహాలను అరికట్టుట పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయిలకు 18 సంవత్సరాలు లోపు, అబ్బాయిలకు 21 సంవత్సరాల లోపు వివాహం జరిగితే దానిని బాల్య వివాహం కింద గుర్తించి చట్టరీత్యా వివాహం చేసుకొను వారికి శిక్షించడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతుంటే పిల్లల హెల్ప్ లైన్ 1098కి కాల్ చేసి వివాహం జరగకుండా అధికారులు అడ్డుకుంటారని సిడిపిఓ తెలిపారు. బాల్య వివాహాలు చేసిన తల్లిదండ్రులకు, పెద్దలకు, వివాహము జరిపించు వారికి శిక్ష పడుతుందన్నారు. బాల్య వివాహాలు నిరోధం గురించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, హెచ్ఎం లక్ష్మిదేవి, ఎస్ఎంసి చైర్మన్ అక్బర్, స్కూల్ టీచర్స్ నాని నాయక్, సరిత, పద్మవేణి, శివప్రసాద్, రవి, అంగన్‌వాడి టీచర్స్ పార్వతి, యాస్మిన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణకు మారుపేరుగా శ్రీ వివేకానంద జూనియర్ కాలేజ్

ప్రిన్సిపల్ మురళి రెడ్డి



చిత్తూరు కార్పొరేషన్, డిసెంబర్ 7 ప్రభాతవార్త క్రమశిక్షణకు నాణ్యమై న విద్యకు మారుపేరుగా శ్రీ వివేకానంద జూనియర్ కాలేజ్ ముందుకు వెళుతున్నదని ప్రిన్సిపల్ మురళి రెడ్డి తెలిపారు. కళాశాలలో నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులైన ఉన్నత విద్యను అభ్యసించిన అధ్యాపకులచే విద్యార్థులకు నాణ్యమైన విద్యను గత 20 సంవత్సరాలుగా అంది స్తున్నదని తెలిపారు. అలాగే విద్యార్థులకు అవసరమైన మౌలిక వస తులు అందించడంలో యాజమాన్యం ముందు ఉందని ప్రిన్సిపల్ తెలిపారు. అలాగే సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం అధునాతనమైన బస్సులను ఏర్పా టు చేయడమే కాకుండా నిపుణులైన డ్రైవర్లను ఏర్పాటు చేసి రాకపోకల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుం టున్నట్లు ప్రిన్సిపాల్ మురళి రెడ్డి తెలిపారు విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేక తరగత గదులను, విశాలమైన లేబొరేటరీలు ఏర్పాటు చేయడంతో పాటు గ్రంథాలయం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ రెడ్డి తెలిపారు.

## క్రమశిక్షణకు మారుపేరుగా శ్రీ వివేకానంద జూనియర్ కాలేజ్

ప్రిన్సిపల్ మురళి రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్, డిసెంబర్ 7 ప్రభాతవార్త క్రమశిక్షణకు నాణ్యమైన విద్యకు మారుపేరుగా శ్రీ వివేకానంద జూనియర్ కాలేజ్ ముందుకు వెళుతున్నదని ప్రిన్సిపల్ మురళి రెడ్డి తెలిపారు. కళాశాలలో నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులైన ఉన్నత విద్యను అభ్యసించిన అధ్యాపకులచే విద్యార్థులకు నాణ్యమైన విద్యను గత 20 సంవత్సరాలుగా అందిస్తున్నదని తెలిపారు. అలాగే విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు అందించడంలో యాజమాన్యం ముందు ఉందని ప్రిన్సిపల్ తెలిపారు. అలాగే సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం అధునాతనమైన బస్సులను ఏర్పాటు చేయడమే కాకుండా నిపుణులైన డ్రైవర్లను ఏర్పాటు చేసి రాకపోకల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ మురళి రెడ్డి తెలిపారు విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేక తరగత గదులను, విశాలమైన లేబొరేటరీలు ఏర్పాటు చేయడంతో పాటు గ్రంథాలయం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ రెడ్డి తెలిపారు.

## మహతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



బైరెడ్డిపల్లి, డిసెంబర్ 7 ప్రభాతవార్త: బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో ఆదివారం మహతి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో కుప్పం పిఈఎస్ హాస్పిటల్ డాక్టర్లచే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 125 మంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోగా 20 మందిని ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఇందులో మెడిసిన్ 5 ఆర్థో 8, సర్జరీ 4, ఆప్తల్ 2, యూరాలజీ 1 రోగులుగా నమోదైంది. వీరిని తమ వాహనంలోనే కుప్పం పిఈఎస్ ఆసుపత్రికి పంపించారని, వీరికి అయ్యే ఖర్చులు మొత్తం ఆసుపత్రి వారు మహతి ఫౌండేషన్ వారు చేసుకుంటరని మహతి ఫౌండేషన్ కార్యనిర్వాహకులు శ్రీనివాసులు తెలిపారు.

## నేడు పోలీస్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరుహెల్త్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి సోమవారం చిత్తూరు పాత జిల్లా పోలీసు కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తుషార్ డూడి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంను ప్రజలు సద్వినియోగం చేసుకుని వారి సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ వెల్లడించారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

– కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, డిసెంబర్ 7 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంను ప్రజలు సద్వినియోగం చేసుకుని వారి సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని సత్వరం పరిశీలించి క్షేత్ర స్థాయిలో సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయిలోనే కాకుండా డివిజన్, మండల స్థాయిల్లో సైతం ప్రతి సోమవారం నిర్వహిస్తున్నామని, అక్కడి సైతం ప్రజలు వెళ్ళి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకోవచ్చునన్నారు.

## బహుదానదిలో నీట మునిగి యువకుడి మృతి

తవణంపల్లె, డిసెంబర్ 7 ప్రభాతవార్త:



బంధువుల ఇంట్లో శుభ కార్యానికి హాజరైన యువకుడు ప్రమాదవశాత్తు బహుదానదిలో నీట మునిగి మృతి చెందిన సంఘటన మండలంలోని ఉత్తర బ్రాహ్మణపల్లెలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు కథనం మేరకు వివరాలిలావున్నాయి, చిత్తూరు చవటపల్లెకు చెందిన వాసు, బార్గవిల కుమారుడు ఎ.జగన్(17) అనే యువకుడు ఆదివారం ఉత్తర బ్రాహ్మణపల్లెలో తమ బంధువుల ఇంట్లో జరిగిన ఓ శుభ కార్యానికి తల్లిదండ్రులతో కలసి హాజరయ్యాడు. ఈసందర్భంగా బంధువులు, తల్లిదండ్రులతో కలసి బహుదానది వద్దకు వెళ్ళిన జగన్ ప్రమాదవశాత్తు నదిలో పడి నీట మునిగి మృతి చెందాడు. మృత దేహాన్ని బంధువులు నది నుండి వెలికి తీశారు. చెట్టంత కొడుకు కళ్ళ ముందే ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు భోరున విలపించారు.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, డిసెంబర్ 7 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం లో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు ఆదివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తెలంగాణా రాష్ట్ర యాదాద్రి భువనగిరికిచెందిన రాజేంద్రప్రసాద్‌రెడ్డి అనే భక్తుడు నిత్యాన్నదానంకు 1,00,335 రూపాయలను విరాళం గా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడులకు చెక్ ద్వారా అందజే శారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## భద్రత నియమాలను పాటించాలి

పూతలపట్టు, డిసెంబర్ 7, ప్రభాతవార్త



వాహనదారులు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సిఐ గోపి అన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో ఇంటి వద్ద కుటుంబాల సభ్యులు తమ కోసం ఎదురుచూస్తున్నారని గుర్తించుకొని ముందుకు సాగాలని వాహనదారులు నడిపేవారు ఇలా కాదని మద్యం సేవించి నడిపేవారుపై కూడా తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలని నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన పార్కింగ్ ప్రదేశం ఇతర సమాచారం చూసిన బోర్డులను అనుచరించి సురక్షితంగా వాహనాలను నడపాలని తెలిపారు.

## కాణిపాకం ఆలయ బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారం

కుప్పం, డిసెంబర్ 7 ప్రభాతవార్త



కాణిపాకం ఆలయ బోర్డు సభ్యులుగా కుప్పంకు చెందిన వసంతమ్మ, బివి నరేషులు ఆదివారం కాణిపాకంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంకు కుప్పం నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ, జనసేన నేతలు, కార్యకర్తలు తరలి వెళ్లారు. తొలుత ప్రభుత్వ విప్, కడ పిఎసి చైర్మన్‌డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా చైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబులు వసంతమ్మ, నరేషలను ఘనంగా సత్కరించారు. అనంతరంకుప్పంనుంచికార్యక్రమంకు హాజరైన నాయకులు, తెలుగుమహిళ నేతలు వారిని సత్కరించారు.

## మైనార్టీ సెల్ అధ్యక్షుడికి కార్మిక యూనియన్ సత్కారం

కుప్పం, డిసెంబర్ 7 ప్రభాతవార్త




తెలుగుదేశం పార్టీ కుప్పం మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు మునాఫ్‌ను ఆదివారం స్థానిక కార్మిక యూనియన్ నేతలు ఘనంగా సత్కరించారు. బైపాస్ రోడ్డులోని చంద్రన్న కార్మిక భవనంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మెకానిక్‌గా వృత్తి నిర్వహిస్తున్న మునాఫ్ సేవలను గుర్తించి సిఎం చంద్రబాబునాయుడు, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ మునాఫ్‌ను మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియమించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మెకానికల్ సంఘ అధ్యక్షులు శివకుమార్, సెక్రటరీ రమణస్వామి, కోశాధికారి ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడు నాగరాజు, నేతలు శివం, వెంకటేష్, హరి, సలామత్, గణేష్, కార్మిక సోదరులు పాల్గొన్నారు. అనంతరం కార్మిక యూనియన్ నేతలు మల్లానూరులో ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్‌ను సత్కరించారు.

## గుడుపల్లె వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లికార్జున



కుప్పం, డిసెంబర్ 7 ప్రభాతవార్త మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైకాపా జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డిఆదేశాలతో గుడుపల్లె మండల వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటాపురంకు చెందిన మల్లికార్జునను నియమిస్తూ ఎమ్మెల్సీ, వైకాపా ఇన్‌చార్జ్ భరత్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే నియోజకవర్గ వైకాపా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా నాగభూషణ ం, గుడుపల్లె మండల వైకాపా ఉపాధ్యక్షుడిగా మంజునాథ్‌లను నియమించారు.

## ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్‌కు నేతల సన్మానం




కుప్పం, డిసెంబర్ 7 ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఎపిఐఐసి) డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మల్లానూరు ప్రేమ్‌కు మార్‌ను ఆదివారం ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ మల్లానూరులోని వినాయక థియేటర్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా చైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులురాజు, తహశీల్దార్ చిట్టిబాబు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మండల టిడిపి అధ్యక్షుడు రాజగోపాల్, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలు హాజరై ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రేమ్‌కుమార్‌హాజరైన నేతలు, కార్యకర్తలకు విందుభోజనం ఏర్పాటుచేశారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు : కడ పి.డి.

కుప్పం, డిసెంబర్ 7 ప్రభాతవార్త నియోజకవర్గస్థాయిలో ప్రతి సోమవారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను 8వతేది అనివార్య కారణాలచేతరద్దు చేసినట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నా ఇల్లు కూల్చేశారు.. నష్టపరిహారాన్ని చెల్లించాలి

చౌడేపల్లి, డిసెంబర్ 7 ప్రభాతవార్త



మండలంలోని దిగువపల్లి పంచాయతీ గంగాపురంలో తన ఇంటిని కూల్చేశారనీ, నష్టపరిహారం చెల్లించాలని తేదేపా నాయకుడు రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేసాడు. ఈమేరకు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తనతో కలసి 5మంది ఇండ్లు పోగొట్టుకున్న బాధితులకు రూ. 60లక్షలు రావాల్సి వుందన్నారు. తనకు అందులో రూ. 12లక్షలు చెల్లించాల్సి వుందన్నాడు. ఇటీవల మండల తేదేపా సంస్థాగత ఎన్నికల పరిశీలకుడుగా వచ్చిన నాగేశ్వర్‌నాయుడుకు తనకు ఎలాంటి సబంధం లేదనీ, నగదు గురించి ఎవరిపైనా ఒత్తిడి తేలేదని రామకృష్ణ స్పష్టం చేశాడు. తేదేపా సంస్థాగత ఎన్నికలు ఎలాంటి ప్రలోభాలకు లోనకాకుండా నిక్కచ్చిగా చేశారని మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ అన్నారు. సింగిల్‌విండో ఛేర్మన్ హరిప్రసాద్, తేదేపా నాయకులు పార్థసారధి, కార్తీక్‌మురళి, గంగాధర్‌రెడ్డి, నరేష్ తదితరులు హాజరయ్యారు.

## శక్తిక్షేత్రంలో సాధారణంగా భక్తుల రద్దీ

బోయకొండ(చౌడేపల్లి), జూన్ 1 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా కనిపించింది. రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణాల నుంచి యాత్రీకులు తరలివచ్చారు. కొండ దినాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చక, వేదపండితులు అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబర్ పర్యవేక్షణలో అధికార, అర్చక, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

## ఘనంగా హరీష్ యాదవ్ జన్మదిన వేడుకలు

గంగాధర నెల్లూరు, డిసెంబరు 7 ప్రభాతవార్త:



మండలంలోని ఎట్టేరికి చెందిన తెలుగుదేశం యువ నాయకుడు ఎమ్మెల్యే థామస్ ప్రీతి పాత్రుడు హరీష్ యాదవ్ జన్మదిన వేడుకలను నియోజక వర్గ కేంద్రమైన గంగాధర నెల్లూరు బస్టాండు కూడలిలో ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలకు ఆరు మాడలాల పార్టీ అధ్యక్షులు కాక ఆరు మండలాలకు చెందిన కూటమి పార్టీలకు సంబంధించి చైర్మెన్లు డైరెక్టర్లు పెద్ద ఎత్తున హాజరవ్వడం విశేషం ఎట్టేరి నుండి గంగాధర నెల్లూరు వరకు రోడ్డు పెద్ద ఎత్తున బారికేట్లు చేసి స్థానిక అల్లిఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరంఅంబేద్కర్ విగ్రహానికి గజమాలతో సత్కరించారు. బస్టాండు కూడలి వరకు బాణాసంచ పేల్లులు బ్యాండ్ వాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వంద కిలోల కేకు కట్ చేసి నాయకులకు కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలాల పార్టీ అధ్యక్షులు జయశంకర్ నాయుడు రుద్రప్ప నాయుడు స్వామిదాస్ పెనుమూరు మార్కెట్ కమీటి చైర్మెన్ కృష్ణమ నాయుడు ఇందిరమ్మ మోహన్ నాయుడు శ్రీధర్ యాదవ్ జ్యోతి యాదవ్ యాగమ రెడ్డిలతో పాటు ఆరు మండలాలకు చెందిన కూటమి పార్టీ నాయకులు కార్యక్తలు పెద్ద ఎత్తున పాల్గొని జన్మదిన శభాకాంక్షలు తెలియజేశారు.

## అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం

గాండ్లపల్లి(చౌడేపల్లి), డిసెంబర్ 7ప్రభాతవార్త



మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ గాండ్లపల్లిలో గల అభయాంజనేయస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారాన్ని కోలాహలంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛేర్మన్‌గా పుంగనూరు మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ ప్రమాణ స్వీకారం చేసారు. అనంతరం 17మంది సభ్యులతో కూడిన నూతన కమిటీ ప్రమాణం చేసింది. ఆలయ సర్వతోముఖాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన బగ్గిడి గోపాల్ అన్నారు. ఆలయ చరిత్ర, గ్రామాభివృద్ధిని అందరికీ వివరించారు. కాలభైరవ ఆలయ పీఠాధిపతి శ్రీరాములురెడ్డిస్వామి, వైకాపా మండలాధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి రుక్మిణమ్మ, కృష్ణారెడ్డి, అమరనాథ్, జంగాలపల్లి రమణ, చుట్టుపక్కలున్న భక్తులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ఉచిత అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

## జిల్లా ఎస్టీయు అధ్యక్ష, కార్యదర్శులుగా మదన్‌మోహన్, ఇలియాజ్‌లు

చిత్తూరు, డిసెంబర్ 7 ప్రభాతవార్త: జిల్లా ఎస్టీయు అధ్యక్షులుగా ఆర్.మదన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఇలియాజ్ భాషాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిత్తూరు సుందరరాజపురం సమీపంలోని విజయం విద్యా సంస్థల్లో ఆదివారం ఎస్టీయు 79వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్టీయు ఆర్థిక కార్యదర్శిగా పురుషోత్తం, గౌరవ అధ్యక్షులుగా పీతాంబరరాజు, రాష్ట్ర కౌన్సిలర్లుగా గంటామోహన్, పురుషోత్తం, దేవరాజులురెడ్డి, చంద్రన్, చంద్రశేఖర్‌నాయుడులు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా కమలాపతి, బొబ్బిలిరెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శులుగా కిశోర్‌కుమార్‌రెడ్డి, సుల్తాన్, జిల్లా ఉపాధ్యక్షులుగా రాజేష్‌కుమార్, గణపతి, కోదండయ్య, కుమార్, సుబ్రమణ్యం, రాజేష్, కుమారస్వామిరెడ్డి, జిల్లా మహిళా కన్వీనర్‌గా రాధాకుమారిలు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారి హరిప్రసాద్‌రెడ్డి, పరిశీలకులుగా బాలగంగిరెడ్డిలు వ్యవహరించారు.

## రాష్ట్రంలో తెలుగు మాధ్యమం కొనసాగించాలి

– జిల్లా ఎస్టీయు కౌన్సిల్ సమావేశం డిమాండ్



చిత్తూరు, డిసెంబర్ 7 ప్రభాతవార్త: తెలుగు రాష్ట్రంలో తెలుగు మాధ్యమంను కొనసాగించే విధంగా ప్రభుత్వం పక్కాగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం డిమాండ్ చేసింది. చిత్తూరులోని విజయం విద్యాసంస్థల ప్రాంగణంలో ఆదివారం జిల్లా ఎస్టీయు కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్టీయు అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్ మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమానికి తాము వ్యతిరేకం కాదని, అయితే తెలుగు మాధ్యమంను కచ్చితంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే గతంలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే 30 శాతంకు తక్కువ కాకుండా మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్షల నుండి మినహాయింపు లభించేలా పూర్తి చర్యలు తీసుకోవాలన్నారు. కడప జిల్లా ఎస్టీయు నాయకులు బాలగంగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేతన సవరణకు చర్యలు తీసుకోవాలన్నారు. సత్యసాయి జిల్లా ఎస్టీయు నాయకులు హరిప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు నిబంధనలు అమలు చేసి పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీయు అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి, జిల్లా నాయకులు బోడె మోహన్‌యాదవ్, పురుషోత్తం, మునెప్ప, హేమచంద్రారెడ్డి, దేవరాజులురెడ్డి, యువరాజు, రాధాకుమారి, చంద్రన్, రమణారెడ్డి, సర్దార్‌తో పాటు పెద్ద ఎత్తున ఎస్టీయు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిఇఓ కార్యాలయ బోధనేతర సిబ్బంది సంఘ అధ్యక్షుడిగా కుమార్




చిత్తూరు, డిసెంబర్ 7 ప్రభాతవార్త: ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖ బోధనేతర ఉద్యోగులు, సిబ్బంది సంఘ అధ్యక్షుడిగా చిత్తూరు జిల్లా డిఇఓ కార్యాలయ సూపరిటెండెంట్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ఎన్జీఓ హోంలో ఆదివారం నిర్వహించిన ఈ ఎన్నికలకు నిర్వహణ అధికారిగా నెల్లూరు జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా నెల్లూరు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎవి సురేషులు వ్యవహరించారు. అలాగే జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా రామ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా రమేష్, ఎస్.నాగరాజ, ఎస్.రెడ్డిశేఖర్, ఎస్ఎ రహమత్‌భాషా, ఎన్.కుమార్, ప్రధాన కార్యదర్శిగా బి.చైతన్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా బాలాజీ, కార్యదర్శులుగా షనుసుల్తాన్, జి.రేణు కాపతి, జీబి తులసీరామ్, బి.దీపిక, కె.రాజేష్, మహిళా కార్యదర్శిగా కృపావతి, కోశాధికారిగా ఎన్.గో పాల్, కార్యవర్గ సభ్యులుగా రవిశేఖర్, టిజె యువరాజ్, సాయి ప్రశాంతి, మునిరాజ్‌లు ఎన్నికయ్యారు.

## చెట్లు నాటి కాలుష్యంను నిర్మూలిద్దాం

గుడిపాల, డిసెంబర్ 7 ప్రభాతవార్త:




స్థానిక సిఎన్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం లో భాగంగా 5వ రోజు ఆదివారం చెట్లు నాటే కార్యక్ర మానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటిని కార్యదర్శి సుందరేషన్ మాట్లాడుతూ చెట్లను నాటి కాలుష్యంను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. ప్రతి విద్యార్థి ఏడాది లో పది చెట్లు నాటి వాటిని పోషించాలని, చెట్లు అనేక జీవులకు నివాసంను కల్పిస్తాయన్నారు. కళాశాల కరెస్పాండెంట్ లోకేష్ మాట్లాడుతూ చెట్లు పర్యావరణంను రక్షిస్తాయన్నారు. జీవకోటికి నిస్వార్థంగా ఉపయోగపడుతాయన్నారు. చెట్లను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్, వాలంటీర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం ఆశయాలకనుగుణంగా

## నియోజకవర్గం అభివృద్ధే డాక్టర్ థామస్ అడుగులు




చిత్తూరుకార్పొరేషన్, డిసెంబర్7ప్రభాతవార్త: కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారితో మమేకమై సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలు, ఆశయాల కనుగుణంగా జిడి నెల్లూరు ఎమ్మెల్యేడాక్టర్‌థామస్ అడుగులు వేస్తున్నారు. నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో, ప్రతి గ్రామంలో ప్రజలకు మౌళిక వస తులు కల్పించడమే ధ్యేయంగా ఎమ్మెల్యే ప్రణాళికాబద్ధంగా పనితీరు సాగిస్తున్నారు. వైద్యవృత్తిలో ఉంటూ రాజకీయాల్లో ప్రవేశించిన డాక్టర్ థామస్ ప్రజాసేవలో ఒక ప్రత్యేతకను చూపుతున్నారు. చిత్తూరుజిల్లాలో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ప్రథమస్థానంలో నిలపాలని ఆకాంక్షిస్తున్నారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన 18 నెలల పాలనలో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటించి నేరుగా ప్రజలను కలసి వారిని పలకరించడం ఆయన అలవర చుకున్న మంచి విదానం. కాంగ్రెస్‌పార్టీ, వైసిపికి బలమైన నియోజక వర్గంగా సాగిన జిడినెల్లూరులో 2024 ఎన్నికల్లోథామస్ గెలుపుతో ప్రభుత్వ విప్ హోదా దక్కించుకున్నారు. గత వైసిపి పాలనలో అధ్వాన్నంగా గుంతలమయంగా మారిన రోడ్లను బాగుచేయడంపై చొరవ తీసుకున్నారు. వెదురుకుప్పం, పెనుమూరు మండలాల్లోని మారుమూల గ్రామాలకు సీసీ రోడ్ల నిర్మాణంవేగంగా జరిగింది. తమిళనాడు సరిహద్దును ఆనుకుని ఉన్న ఈ నియోజకవర్గంలో, సరిహద్దు రోడ్ల విస్తరణకు ప్రత్యేక నిధులు కేటాయించారు. దీనివల్ల రైతులు తమ పంటను చెన్నై వంటి నగరాలకు తరలించడానికి సులభమైంది. కార్వేటినగరం, ఎస్.ఆర్.పురం మండల కేంద్రాల్లో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఏడాదిలో 10 కోట్ల రూపాయలకు పైగా నిధులతో ఆధునిక డ్రైనేజీ వ్యవస్థకు పునాదులు వేయించారు. వేసవి కాలంలో నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామంలోనూ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసే పరిస్థితి రాకూడదని భావించి, జల్ జీవన్ మిషన్‌ఖి నిధులను సమర్థవంతంగా వినియోగించి, ఇంటింటికీ కుళాయి నీరు అందించే పనులను పూర్తి చేశారు.

అదేగాక నియోజకవర్గ పరిధిలో చాలావరకుపేద, మధ్య తరగతివర్గాల విద్యార్థుల ఉన్నత విద్యకోసంఅవసరమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అసెంబ్లీలో ప్రస్తావించారు. ఆయన పట్టుదలతో కార్వేటినగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు తుది దశలో ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్యే అయిన థామస్ డాక్టర్ కూడాకావడంతో నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత రానీయకుండా, అవసరమైన మందులు సిద్ధంగా అందుబాటులో ఉండేలా చూడటంలో సఫలమయ్యారు. మారుమూల గ్రామీణప్రాంతాల ప్రజలకు స్పెషలిస్ట్ వైద్యం అందేలా మొబైల్ మెడికల్ యూనిట్లను బలోపేతం చేశారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావుతో కలిసి ఎమ్మెల్యే థామస్ మామిడి రైతుల సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారు. మామిడి బోర్డు ఏర్పాటు కోసం డిమాండ్ చేయడం. తోటల పునరుద్ధరణకు హార్టికల్చర్ శాఖ ద్వారా సబ్సిడీలు ఇప్పించడం. పల్ప్ పరిశ్రమల యాజమాన్యాలతో చర్చలు జరిపి రైతులకు మెరుగైన ధర దక్కేలా కృషి చేశారు.

గతంలో ఎమ్మెల్యేను కలవాలంటే సామాన్యులకు కష్టంగా ఉండేది, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. ప్రతి సోమవారం, నియోజకవర్గంలో అందుబాటులో ఉన్నప్పుడు డాక్టర్ థామస్ "ప్రజా దర్బార్" నిర్వహిస్తున్నారు. ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం లేదా అధికారులకు ఆదేశాలు జారీ చేయడం ద్వారా పాలనలో వేగం పెంచారు.

## భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్దరించాలి

శ్రీకాళహస్తి,డిసెంబర్ 7 ప్రభాతవార్త



భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్దరించి కార్మికులను ఆదుకోవాలని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేసారు.ఆదివారం జిల్లా భవన నిర్మాణ కార్మికుల సమావేశం జిల్లా అధ్యక్షులు కత్తిరవి అధ్యక్షతన జరిగింది. నేడు వర్షాల కారణంగా భవన నిర్మాణ పనులు లేకుండా ఉపాధి కోల్పోయి ఇబ్బంది పడుతున్నారని కూటికి లేక తల్లడిల్లుతున్నారన్నారు.నియోజకవర్గ సమావేశాన్ని రమేష్ పర్యవేక్షణలో నిర్వహించారు.కూటమి ప్రభుత్వం ఉపాధి కొల్పోయిన కార్మీకులను ఆదుకొనుటకు ముందుకు రావాలన్నారు. భవన నిర్మాణ కార్మీకులను ఆదుకొనుటకు ఇన్సురెన్స్,చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక కార్మికుడు ఈ శ్రమ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని పిలుపు నిచ్చారు. గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు మళ్ళించి వాడుకున్నారని వాటిని తిరిగి బోర్డుకు జయ చేయాలని సమావేశం డిమాండ్ చేసారు.ఈసమావేశంలో పలు అంశాలు,సమస్యలకు సంబంధించి తొండు మల్లికార్జున్, సిపిఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, పట్టణ కార్యదర్శి రోడ్డ గోపి, దివాకర్, సురేష్,రవికుమార్, రమేష్, గురవయ్య, రమణయ్య తదితరులు కార్మికుల సమస్యలపై చర్చించారు.

## స్థానికులకు 10న ఆన్‌లైన్‌లో వైకుంఠద్వార టోకెన్లు

–జనవరి 6,7,8న దర్శనాలకు అవకాశం

ప్రభాతవార్తప్రతినిధి–తిరుమల:



తిరుమలేశుని ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనమ్ స్థానికులకు టిటిడి కల్పించనుంది. జనవరి 6,7,8తేదీల్లో వరుసగా చివరి మూడురోజులు తిరుమల,తిరుపతి,చంద్రగిరి, రేణిగుంట వాసులకు మాత్రమే, రోజుకు ఐదువేల మందికి టోకన్లు ఆన్‌లైన్‌లో10వతేదీబుధవారం(ఎల్లుండి) విడుదల వుతూన్నాయి.స్థానిక భక్తులు తమతమ ఆధార్‌కార్డు ఆధారంగా టిటిడి వెబ్‌సైట్ టిటిదేవస్థానమ్స్. ఎపి.జిఒవి, ఇన్,మొబైల్‌యాప్ .వాట్సాప్‌లో ఏపి ప్రభుత్వబాట్‌లో బుక్‌చేసుకోవాల్సి ఉంటుంది. పది రోజుల వైకుంఠ ద్వారదర్శనాలసమయంలోమొత్తం 182 గంటల్లో 164గంటలు సామాన్యభక్తులకు టిటిడి కేటాయించింది.

## జీవితంపై విరక్తితో విద్యార్థి ఆత్మహత్య

తిరుపతి,డిసెంబర్ 7ప్రభాతవార్త:



కుటుంబ సమస్యలు, జీవితంపై విరక్తిచెంది ఇంటర్ విద్యార్థి ఇంట్లోనే ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఈ సంఘటన వెలుగుచూసింది. మృతుని తల్లి పగడాల మాధ విలత ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి తెలిపారు. నగరంలోని బ్లిస్ హోటల్ వెనుకవైపు తెలుగునగర్‌లో పగడాల మాధవిలత కుటుంబం నివాసముంటుంది. ఆమె చిన్నకుమారుడు పగడాల మోహన్‌కుమార్(17)ఓ కళాశాలలో ఇంటర్‌ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గతకొంతకాలంగా మానసికంగా బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తిచెందిన అతను శనివారం రాత్రి ఇంట్లోనే ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదుతో మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించి కేసునమోదు చేసినట్లు ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

## అట్టహాసంగా నారాయణ ప్రీమియర్ లీగ్ - 2025 ముగింపు వేడుక.

తిరుపతి విద్య, డిసెంబర్ 7 ప్రభాతవార్త



శ్రీనివాస మంగాపురం నారాయణ పాఠశాల యందు నారాయణ ప్రీమియర్ లీగ్ పేరుతో క్రీడలు పోటీలు నిర్వహించారు. ఇందులో తిరుపతి, చిత్తూరు, మదనపల్లి, వేలూరు జిల్లాలోని నారాయణ పాఠశాలల 10వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ టి వి రామకుమార్ తిరుమల డి ఎస్ పి వి జి ఓ విచ్చేసి విద్యార్థులకు క్రీడల పట్ల గల అభిరుచిని,క్రీడలు మానసిక వికాశానికి తోడ్పడుతాయని, విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉండగలరని వివరించారు.ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాలల కార్యనిర్వాహణాధికారి కొండల రావు మాట్లాడుతూ ప్రతి ఒక విద్యార్థి చదువుతో పాటు క్రీడల పట్లు, ఆటలపట్లు ఆశక్తిని పెంచుకోవాలని క్రీడలు విద్యార్థులలో మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలియజేసారు.వివిధ రకాల క్రీడలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేసారు.విద్యార్థులకు క్రీడలు శారీరక దృఢత్వాన్నే కాకుండా జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను తట్టుకునే మానసిక దృఢత్వాన్ని ఇస్తాయని, తమ విద్యాసంస్థలు క్రీడలకు కూడా అత్యంత ప్రాధాన్యతనిస్తాయని అందువల్లనే తమ విద్యార్థులు అత్యంత ఒత్తిడితో కూడిన వివిధ పోటీ పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించ గలుగుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలేజీ కోర్ డీన్ ఏ ఎస్ ఆర్,ఎ జి ఎం లు ఎ శ్రీనివాసులు,రవీంద్ర ఫణి కుమార్, ఆర్ ఐ లు ప్రిన్సిపల్స్, రవికాంత్ గుప్తా, లీలాధర్, శ్రీనివాసులు, అకడమిక్ కోఆర్డినేటర్స్,ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న నృత్య, కళాత్మక పోటీలు

తిరుపతి విద్య, డిసెంబర్ 7 ప్రభాతవార్త



ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ రెండవ దశ అంతర కళాశాల క్రీడా సాంస్కృతిక పోటీలలో భాగంగా మూడవరోజు జరిగినటువంటి నృత్య ప్రదర్శనలు సాంస్కృతిక కార్యక్రమాలు అథ్లెటిక్ పోటీలు అట్టహాసంగా నిర్వహించబడ్డాయి మూడో రోజు భాగంగా జరిగిన నృతీ పోటీలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం రెడ్డి శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమాలతో పాటు సెటిల్, బ్యాట్మెంటన్,టేబుల్ టెన్నిస్,చదరంగం వంటి విభాగాలలో విద్యార్థిని విద్యార్థులు పోటీపడి తమ ప్రతిభను కనబరిచారు చదరంగం విభాగంలో శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల బాల్ బ్యాట్మెంటన్ నందు ఉదయగిరి వ్యవసాయ కళాశాల 100 మీటర్ల పరుగు పందెంలో తాడిపత్రి వ్యవసాయ కళాశాల 200 మీటర్ల పరుగు విభాగంలో ఎస్వీ వ్యవసాయ కళాశాల విజేతలుగా నిలవడం జరిగిందని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రవికాంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థి వ్యవహారాల ఇంచార్జ్ డాక్టర్ కే హరిప్రసాద్, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## కీచక ప్రొఫెసర్‌ను అరెస్టు చేయాలి

విద్యాలయంలో అమ్మాయిలకు భద్రత కల్పించాలి. ఎస్ఎఫ్ఐ, ఐద్వా

విద్యార్థినీలకు రక్షణ కల్పించలేని వీసీ రాజీనామా చేయాలి

తిరుపతి విద్య, డిసెంబర్ 7 ప్రభాతవార్త



జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో విద్యార్థిని పై లైంగిక వేధింపులు కు పాల్పడిన ప్రో. లక్ష్మణ్ ను తక్షణమే అరెస్ట్ చేసి శిక్షి ంచాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో సంస్కృత యూనివర్సిటీ ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎన్ఎస్ యులో విద్యార్థిని లోబర్చుకొని ప్రాక్టీకల్స్, మార్క్స్ కోసం అమ్మాయిని లోబర్చుకోవడం, వేదించడమే కాకుండా అసభ్యక ఫోటోలు తీసి బ్లాక్ మెయిల్ చేయడం, అక్కడి తో ఆగకుండా మరో ప్రొఫెసర్ ఆ వీడియోస్ పెట్టుకొని ఆ అమ్మాయి ను వేదించడం చుస్తే ధర్మలు బోధిస్తు సంస్కృత యూనివర్సిటీ లో విషసంస్కృతం నెలకొనడం సిగ్గు చెటని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది జరిగి వారం అవుతున్న యూనివర్సిటీ వీసీ గప్పుచప్పుడు కాకుండా లోలోప్పులే సర్దుబాటు చేయడం దుర్మార్గం అని తక్షణమే నైతిక భాద్యత గా వీసీ రాజీనామా చేయాలనీ వారు డిమాండ్ చేశారు. విద్యాలయాలలో అమ్మాయిలు కు రక్షణ కల్పించి, అంతర్గత కమిటీ లు వేసి పర్యవేక్షణ చేయాలనీ, కిచక ప్రొఫెసర్స్ ను యూనివర్సిటీ నుంచి బయటకు తరిమేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ సాయి లక్షి ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి లు అక్బర్, రవి, ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర గర్ల్ కో కన్వీనర్ పవిత్ర, జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, అశోక్, జిల్లా నాయకులు శ్రీనివాస్, నగర నాయకులు మారుతీ, మార్కెండెయ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## 11న మండల అధ్యక్ష ఎన్నిక

విజయపురం, డిసెంబరు 7 ప్రభాతవార్త:

ఈ నెల 11న గురువారం ఉదయం 10 గంటలకు విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు(ఎంపీపీ) ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేంద్ర తెలిపారు. గతంలో ఉన్న ఎంపీపీ రాజీనామా చేయడంతో ఇన్‌చార్జి ఎంపీపీగా మంజు బాలాజీ కొనసాగుతున్నారు. ప్రభుత్వం ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని ఆదేశాల మేరకు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## కళత్తూరు దళితవాడ వాసులకు సాయం

తిరుపతి హెల్త్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:



ఒళ్ళూరు రాయల చెరువు తెగడంతో సర్వం కోల్పోయిన కేవీబి పురం మండలంలోని కలత్తూరు దళితవాడ వాసులకు నింద్ర మండలం కావనూరు మాజీ ఎంపీటీసీ టిడిపి నాయకుడు జగన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ అసోసియేషన్ నార్త్ అమెరికా వారి సౌజన్యంతో చీరలు దుప్పట్లు పంపిణీ చేశారు. కళాత్తూరు దళితవాడలో సుమారు 400 మందికి చీరలు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ప్రతి ఏడాది అంబేద్కర్ వర్ధంతి రోజున సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితే అన్నారు. ప్రస్తుతం సర్వం కోల్పోయిన బాధితులకు సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు.

## కొండమిట్టలో జాతర చాటింపు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలో ఏడు గంగమ్మల జాతర సందర్భంగా ఆదివారం బేరి వారి మండపం వద్ద గల గంగమ్మ రాయి వద్ద చాటింపు జరిపారు.జాతరకు ముందు చాటింపు జరిపే ఆచారం ఉంది. ఈ నేపథ్యంలో రజక వంశస్తులు మొదటి పూజలు నిర్వహించే ఆచారం ఉంది. ఈనేపథ్యంలో ఆదివారం బేరివారి మండపం వద్ద సంప్రాదాయ బద్దంగా పూజలు నిర్వహించారు. రంజక వంశస్థులకు చెందిన సంజాకుల గురవయ్య, బాలసుబ్రమణ్యంల సారధ్యంలో పూజా కార్యక్రమాలు జరిపారు.ఇక్కడ అమ్మవారికి దూపదీప నైవేద్యాలు సమర్పించి హారతులిచ్చారు. బేరివారి మండపం గంగమ్మ కమిటి చెందిన నాగమల్లి దుర్గా ప్రసాద్, వజ్రం కిషోర్,,అంజూరు రాజా,వినయ్,రెకానిక్‌రెడ్డి, సుబ్బు,పవన్ రాయల్ సతీష్‌రాయల్, గ్యాస్‌బాబు, చందు,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో పందుల బెడద: పట్టించుకోని అధికారులు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో రోజు రోజుకు పందుల బెడద పెరుగుతుంది. అయితే మున్సిపల్ అధికారులకు మొరబెట్టుకుంటున్నా పట్టించుకోవటం లేదనే అసంతృప్తి జనాల్లో చోటు చేసుకుంది. ఆదివారం తెలుగుగంగ కాలనీకి చెందిన పలువురు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసారు. శ్రీకాళహస్తి తెలుగుగంగ కాలనీ క్యాంపస్‌లో మున్సిపల్ ఉన్నత పాఠశాల, బాలికల వసతి గృహం, గురుకులం, శ్రీ విద్యాప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. అయితే ఇక్కడ నిత్యం పందులు సంచరిస్తున్నాయి. ఇప్పటికే జనం సీజనల్ వ్యాధులతో తల్లడిల్లుతున్నారు. ఇక అభివృద్ధి చెందుతున్న ఎస్‌డికె నగర్,హరహర బావి ప్రాంతాలు,ఏరియా ఆసుపత్రి, చెంచులక్ష్మీ కాలనీల్లో పందులు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి, ఏరియా ఆసుపత్రికి ఎదురుగా ఉన్న కమ్యూనిటి హాస్టల్‌లో మరీ పరిస్థితి దారుణంగా మారింది. ఇప్పటికే అక్కడక్కడా డెంగ్యూ జ్వరాలు సోకినట్లు చెబుతున్నారు. అంతేకాక పట్టణంలో పందులు విచ్చల విడిగా సంచరిస్తున్నాయి. కానీ ఎందుకో మున్సిపల్ అధికారులు పట్టించుకోవటం లేదనే అసంతృప్తి చోటు చేసుకుంది. గతంలో పలు ప్రాంతాల్లో మెదడువాపు వ్యాధి సోకిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం కుంటలు నిండుగా ఉన్నాయి. దోమలు ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్నాయి.ఇప్పటికైనా అధికారులు స్పందించి పందుల బెడదను తొలగించుటకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## జయమ్మకు నివాళులు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డి కండ్రిగ గ్రామంలో ఇటీవల దారుణ హత్యకు గురైన జయమ్మకు మాజీ శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి వారి సహాచరులు నివాళులు అర్పించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు సమర్పించి సంతాపం తెలిపారు. ఆదివారం పుల్లారెడ్డి కండ్రిగ గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూధనరెడ్డి సారధ్యంలో కర్మక్రతువుల కార్యక్రమం ఏర్పాటు చేసారు. మాజీ ఎంఎల్‌ఏతో పాటు ఉమ్మడిచిత్తూరుజిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు, పఠాన్ ఫరీద్, కంఠా ఉదయ్‌కుమార్,ఫజల్ వవెంకటయ్య,యుగంధర్‌రెడ్డి, వెంకట రమణారెడ్డి,వయ్యాల కృష్ణారెడ్డి, బ్రెసుదర్శనం రెడ్డి, కాసరం డిల్లిబాబు, కోగిలి సుబ్రమణ్యం,యుగంధర్‌రెడ్డి వయ్యాల మనోహర్‌రెడ్డి, కోవి చంద్రయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నాటి హామీలను అమలు చేసి న్యాయం చేయండి

వన్నెకుల క్షత్రియుల సమావేశం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎన్నికల ముందు వన్నెకుల క్షత్రియులకు ఎన్నో హామీలు ఇచ్చారని వారిని అమలు చేసి న్యాయం చేయాలని ఆదివారం పొన్నాలమ్మగుడి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వన్నెకుల క్షత్రియుల ప్రత్యేక సమావేశంలో కోరారు. ఎన్నికల ముందు యువగళంలో మూడు నియోజకవర్గంలో పర్యటించిన యువ నాయకుడు నారాలోకేష్ ఆత్మియ సమావేశంలో ఎన్నో హామీలు ఇచ్చారన్నారు. నాడు నేటి శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి కన్వీనర్‌గా ఉన్నారన్నారు. వన్నెకుల క్షత్రియులకు రాజకీయ ప్రాధాన్య కల్పిస్తామని,ఎంఎల్‌సిగా నామినేటెడ్ ఛైర్మెన్లుగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్‌గా లేదా తుడా ఛైర్మెన్‌గా అవకాశం కల్పిస్తామని అలాగే నామినెటెడ్ పదవుల్లో సభ్యులుగా అవకాశం కల్పిస్తామని వన్నెకుల క్షత్రియుల సామాజిక వర్గాన్ని బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారని కులాన్ని ఎంబిసిగా చేర్చే బాధ్యత తీసుకుంటామని చర్చించారు. వన్నెకుల క్షత్రియుల భవన నిర్మాణానికి రెండెకరాల స్థలాన్ని కేటాయించుటకు హామీ ఇచ్చారన్నారు.స్థానిక శాసనసభ్యులు బొజ్జల సుధీర్‌రెడ్డి పరిశీలించి న్యాయం చేయటానికి ప్రయత్నించాలని కోరారు.ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురువారెడ్డి, వన్నెకుల క్షత్రియుల కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్‌రవి, పార్టీ నాయకులు పేట బాలాజి, దొరైరాజురెడ్డి, మునిరెడ్డి, సోయండి ఈ శ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మురళి, గింగిరెడ్డి, నాగరాజ, మస్తాన్‌రెడ్డి, శివరెడ్డి, మునెయ్య, మునిసుబ్బారెడ్డి, ఆనంద్‌రెడ్డి, పురుషోత్తం, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకునుటకు ప్రత్యేక నిధులు కేటాయించాలి!

రంగినేని చెంచయ్యానాయుడు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయ ప్రధాన దివ్య క్షేత్రంగా విరాలజిల్లుతుందని రబీ,ఖరీఫ్ సీజన్లలో సుమారు 32వేల హెక్టార్లలో పంటలను పండిస్తున్నారు.వారిని ఆదుకొనుటకు మార్కెటింగ్ కమిటిలకు ప్రత్యేక నిధులు అందించాలని మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు మంత్రిని కోరారు. ఆదివారం విజయవాడలో మార్కెటింగ్ కమిటిల ఛైర్మెన్స్ ఆత్మీక సమావేశం నిర్వహించారు. మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్స్ సమావేశానికి సంబంధిత శాఖ మంత్రి డోల వీరాంజనేయులు స్వామి ముఖ్యఅతిధిగా వచ్చారు.ఈ సందర్భంగా మంత్రి మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్లకు దిశ దెశ నిర్దేశం చేస్తూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు రైతులకు అందిస్తున్న సదుపాయాలను వెసులుబాట్లను వివరించారు.అలాగే నూతన వ్యవసాయ విధానాలు, మార్కెటింగ్ కమిటిల అభివృద్ధికి మార్గదర్శకాలు, రైతుల సంక్షేమానికి ఇంకా ఏం చేయాలనే అంశంపై చర్చించినట్లు సమాచారం.ఈ సమావేశంలో చెంచయ్యానాయుడు మాట్లాడుతూ శ్రీకాళహస్తి రైతులకు యూరియా అందించుటకు అవకశాలను కల్పించాలని, అలాగే రైతులు పండించిన పంటను గిట్టుబాటు ధర వచ్చే వరకు పండించిన పంటలను నిల్వ ఉంచుకొనుటకు వారికి పూర్తి స్థాయి చెల్లింపులు చేయటానికి అవకాశం కల్పించాలని కోరినట్లు సమాచారం

## గంగమ్మ జాతర గ్రంధం ఆవిష్కరణ

శ్రీకాళహస్తి,డిసెంబర్ 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ఏడుగంగమ్మల జాతరకు ఎంతో ప్రాధాన్యత ఉంది. మంచుకాలంలో నిర్వహించే జాతరకు సంబంధించిన సమగ్ర సమాచారాన్నిఒ దించుటకు విద్యుత్‌శాఖలో దీర్ఘకాలం అకౌంట్స్ ఆఫీసర్‌గా పని చేసిన పి.రాజేంద్రన్ ప్రాచీన గ్రంధాల నుంచి సేకరించిన అంశాలను సంక్షిప్తం చేస్తూ పుస్తక రూపంలో అందించారు.ఈ పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కంరించారు. హంగామా లేకుండా సంకల్పసిద్ధి వినాయక ఆలయం వద్ద ఆవిష్కరించారు.శ్రీకాళహస్తిలోని ఏడుగంగమ్మల జాతరకు సంబంధించి 1945లో బులుసు వెంకటేశ్వర్లు రచించిన బ్రహ్మవైవర్తన పురాణంలో పేర్కొన్న అంశాలను, అలాగే ప్రకృతి శాస్త్రవేత్త శ్రీవేని మాధవి రచించిన దేవీ భాగవతం నుంచి సేకరించిన అంశాల ఆధారంగా రూపొందించారు.40పేజీల పుస్తకంలో సామాన్యులకు అందని ఎన్నో అంశాలను విషయాలను పొందుపరచారు. ఏడు గంగమ్మల జాతరకు సంబంధించి ప్రాశస్త్యంను సోదాహరణంగా పొందుపరచారు.

## మనిషిని సన్మార్గం వైపు నడిపించేది భగవద్గీత

తిరుపతి,డిసెంబర్ 7ప్రభాతవార్త:

మానవ సమాజాన్ని సన్మార్గంలో నడిపే శక్తి భగవద్గీతకు ఉందని హెచ్‌డిపిపి కార్యదర్శి శ్రీరాంరఘునాథ్ తెలిపారు. హెచ్‌డిపిపి ఆధ్వర్యంలో ఆదివారం అన్నమాచార్యకళామందిరంలో భగవద్గీత శ్లోకాల కంఠస్థం పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ఆధ్యాత్మిక కోణంలో మనిషి ఎలా జీవించాలో భగవద్గీత తెలియజేస్తుందన్నారు. చెడు మీద మంచి విజయంసాధించడమే గీతీ సారాంశమన్నారు. గీతా జయంతి వేడుకల్లో మొదటి విభాగంలో ప్రథమ బహుమతి కెపి ముకుంద, ద్వితీయ బహుమతి కెపిశ్రీ, తృతీయ బహుమతి ఎం.వైష్ణవి పొందారు. రెండవ విభాగంలో డి.నిశాంత్ చక్రవర్తి, ఎం.జశ్వంత్, ఎస్.నాగవేణి, మూడవకేటగిరీలో పిహెచ్ వెంకటనారాయణ, ఎం.లహరి, ఎస్.ఉమామహేశ్వరి బహుమతులు గెలుపొందారు.

# తిరుపతి డివిజన్

## కారుతో సహా ఎర్రచందనం పట్టివేత

భాకరాపేట, డిసెంబర్ 07 ప్రభాతవార్త



భాకరాపేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలో కారుతో సహా ఎర్రచందనం పట్టుకున్నారు. ఎర్రచందనం తరలిస్తున్నారని ఫారెస్ట్ రేంజ్ అధికారి వెంకటరమణకు సమాచారం అందింది. దీంతో ఆయన తన సిబ్బందితో చిన్నగొట్టిగల్లు మండలం రెడ్డి చెరువు దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదివారం తెల్లవారుజామున కారు రావడం గమనించి ఆపగా కారును వదిలి కొందరు పారిపోయారు. కారును పరిశీలించగా అందులో తొమ్మిది ఎర్రచందనం దుంగలు ఉన్నాయని, పారిపోయిన వ్యక్తుల కోసం గాలింపు జరుగుతుందన్నారు.

## కోటి సంతకాల సునామీలో చంద్రగిరిదే అగ్రస్థానం

– తుమ్మలగుంటలో వైసిపి కోటి సంతకాల కృతజ్ఞతాభివందన సభ

–ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లు ప్రవేట్‌పరం చేయడాన్ని ప్రజల్లో ఉగ్ర వ్యతిరేకత

– చంద్రగిరి వైసిపి ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



**తిరుపతిరూరల్,డిసెంబర్ 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రవేట్ పరం చేయాలనే ప్రభుత్వ దుర ఆలోచనకు ప్రజల్లో ఉగ్ర వ్యతిరేకత వ్యక్తమైతుందని చంద్రగిరి వైసిపి ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం తుమ్మలగుంటలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కోటి సంతకాల కృతజ్ఞతాభివందన సభ అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ కోటి సంతకాల సునామీలో చంద్రగిరిదే అగ్రస్థానం అని, నియోజకవర్గంలోని 116 గ్రామ పంచాయతీల నుంచి 1,16000 సంతకాలు పూర్తి చేసి సంచలనం సృష్టించిందన్నారు. ప్రజలకు విద్య, వైద్యం దూరం చేసే ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలు గట్టిగా తిరస్కరించారన్నారు. జగనన్న నిర్మించిన ప్రతి సంక్షేమ పథకాన్ని సిఎం చంద్రబాబునాయుడు క్రెడిట్ చోరీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిధులతో కట్టించిన మెడికల్ కాలేజ్‌లు, వాటి అనుబంధ ఆసుపత్రులు...ఇవన్నీ పిపిపి పేరుతో ప్రవేట్ వ్యక్తులకు అప్పగించడం అమానుషం అన్నారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేసి 174రోజులు పెట్టి, చంద్రగిరిని బలహీ నపరచాలని చూస్తున్నారని మోహిత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. వైసిపి నేతలు జోగి రమేష్, పిన్నెలి, కాకాని, ఎంపిమిధున్‌రెడ్డివంటినేతలపై జరుగుతున్న రాజకీయ ప్రతీకారాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

**జగనన్న పిలుపుతో కలిదిన సైన్యం...175 సీట్లలో 160 సీట్లు లక్ష్యం**

జగనన్న పిలుపు ఒక్కటే చంద్రగిరి నియోజకవర్గంలో ప్రభంజనం సృష్టించిందని మోహిత్‌రెడ్డి అన్నారు. 2029 ఎన్నికలలో 175 సీట్లలలో 160 సీట్లు సాధించడమే ధ్యేమని తెలిపారు. ఆ గెలుపు కూడా చంద్రగిరి నియోజకవర్గం నుంచే ప్రారంభమైతుందని ధీమా వ్యక్తం చేసారు. ఇంతభారీ స్థాయిలో జరిగిన ప్రజా భాగస్వామ్యం రాష్ట్ర రాజకీయం దృష్టిని చంద్రగిరిపై మరలించిందన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి నియోకవర్గం వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివాదాస్పదమైన భూములపై

ఎస్సీ, ఎస్టీ కేసులపై ఏఎస్‌పీ, ఆర్డీవో విచారణ



**బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 7 ప్రభాత వార్త:** ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం దళితులపై అక్రమ కేసులు బలాయించారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మండలంలోని కాంపాళెం, నీర్పకోట గ్రామస్తుల మధ్యలో వివాదాస్పదమైన ప్రభుత్వ భూములపై ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి ఏఎస్‌పీ, ఆర్డీవో, తహసీల్దార్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. నీర్పకోట సర్వే నెం.87/9లో 29 సెంటు సంబంధించి భూ వివాదంపై ఆదివారం అధికారులు విచారణ చేశారు. ఈ భూ వివాదంపై అడిషనల్ ఎస్పీ రవిమనోహర్ ఆచారి, ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ శ్రీదేవి సమక్షంలో భూ వివాదం కేసుకు సంబంధించి ఇరు వర్గాలతో బహిరంగంగా వారి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకుని ఆధారాలను ఇరువర్గాల నుంచి సేకరించారు. విచారణలో గోపి, బాలుకు సంబంధించి అధికారులు ఫోటోలు, అర్జీలు పాటు వీడియోలు పెన్‌డ్రైవ్ ద్వారా అడిషనల్ ఎస్పీకి గోపి వర్గానికి సంబంధించిన బాధితులు సమర్పించడం జరిగింది. ఇరు వర్గాలతో అభిప్రాయాన్ని స్వయంగా తెలుసుకుని సంబంధించిన పూర్తి స్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు.

## కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న మోదీ సర్కార్‌ను సాగనంపుదాం

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి



**పుత్తూరు రూరల్, డిసెంబరు 7 ప్రభాతవార్త:** ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఏఐటీయూసీ) పుత్తూరు డివిజన్ ఆఫీస్ బేరర్స్ సమావేశం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలు రద్దు పరచి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం బీజేపీ మోదీ ప్రభుత్వ దుర్మార్గ చర్య అని పెట్టుబడి దారులకు ఊడిగం చేయడం కోసం వారిని సంతోష పరచడం కోసం కేంద్రంలో మోదీ సర్కార్ ఈ సాహసానికి పాల్పడిందని ఆయన అన్నారు. బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలు రద్దు పరచి కార్మిక వర్గాన్ని కట్టు బానిసలు చేసే ప్రయత్నం చేస్తుందని, కార్మిక హక్కులు కాలరాస్తూ ఉద్యోగ భద్రతను తొలగిస్తూ 8 గంటల పని విధానాన్ని 10 నుంచి 15 గంటల వరకు పని చేయించుకోవచ్చునని పెట్టుబడి దారులు కోరుతున్నారు. కార్మికుల హక్కులు హరిస్తూ తీసుకువచ్చిన ఈ కార్మిక కోడ్ రద్దు చేసేంత వరకు కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధపడాలని అందుకు అన్ని కేంద్రకార్మిక సంఘాలు సన్నద్ధం కావాలని ఆయన అన్నారు. సమావేశంలోపుత్తూరుడివిజన్ కార్యదర్శి చంద్రబాబు, గోపి, హేమావతి, వెంకటరమణ, శరవణ పాల్గొన్నారు.

## దళితుల దాడిపై మాకు న్యాయం చేయండి

బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 7 ప్రభాతవార్త:



ప్రభుత్వ భూములు జీవన ఉపాధి కోసం వసతి రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకుంటే దళితులపై ఇతర కులాల వారు దాడి చేయడం బాధాకరమని పై స్థాయి అధికారులు విచారణ చేపట్టి న్యాయం చేయాలని అడిషనల్ ఎస్పీని ఫిర్యాదు పూర్వకంగా గోపి, బాలు తదితరులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు జీవనోపాధి కోసం చిన్న షెడ్డు వేసుకుంటే అగ్ర కులాలకు చెందిన వారు ప్రభుత్వ భూమికి సంబంధించి భూములపై మాపై దాడి చేయడం అన్యాయమని, పూర్తి స్థాయిలో దర్యాప్తు సేపటి న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు.

## దోమలతో విద్యార్థులు సతమతం

– స్పందించని విద్యాశాఖ అధికారులు

పాకాల, డిసెంబర్ 7, ప్రభాతవార్త



పాకాల మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో చదివే చిన్నారులు కొంతకాలంగా దోమల దాడి వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని పాఠశాలలో యుద్ధ ప్రాతిపదికన దోమల నివారణ చర్యలు చేపట్టవలసినదిగా తల్లిదండ్రుల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు అందుతున్నాయి. ప్రైవేటు పాఠశాల యజమాన్యాలకు తల్లిదండ్రులు దోమల నివారణపై స్పందించ మని చాలా సార్లు చెప్పిన తగు చర్యలు తీసుకోవడంలో యాజమాన్యాలు మీనమేషాలు లెక్కిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం విద్యార్థులు దోమలవల్ల విష జ్వరాలైన, టైఫాయిడ్, డెంగు, మలేరియా, బారిన పడే అవకాశం ఉన్నందున వెంటనే సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి దోమల నివారణకై చర్యలు చేపట్టవల్సిందిగా పేద విద్యార్థులు వారి తల్లిదండ్రులు కూటమి ప్రభుత్వ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

## అర్చక పురోహితులే లక్ష్యంగా దక్షిణ భారతీయ వివాహ పరిచయ వేదిక

పుత్తూరు రూరల్, డిసెంబరు 7 ప్రభాతవార్త:



పుత్తూరు శ్రీ గాయత్రీదేవి బ్రాహ్మణ సంక్షేమ సమైక్య ఆధ్వర్యంలో దక్షిణ భారతీయ బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక ఫిబ్రవరి 22వ తేదీ 2026లో పుష్పగిరి పీఠాధిపతులు శ్రీ ఉద్దండ గణపతి వేద పాఠశాల కరకంబాడి రోడ్డు, మంగళం తిరుపతిలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నరసింహచార్యులు, గాయత్రీ బ్రాహ్మణ సేవా సమితి బాలాజీ, రాణిపేట గౌరవ అధ్యక్షులు అలూరి రామకృష్ణ, సేవా సంస్కృతిక విభాగం కన్వీనర్ లక్ష్మి రమేష్‌లు మాట్లాడుతూ ఈ వివాహ పరిచయ వేదికను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని బ్రాహ్మణ కుటుంబ సభ్యులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివాహ పరిచయ వేదిక కన్వీనర్ బాలాజీ రావు, జిల్లా అధికార ప్రతినిధి బాలాజీ శర్మ రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పుత్తూరు బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చిట్టమూరు రమేష్ బాబు, శివరామకృష్ణ, ముకుందాపురం మహేష్, పాతికొండ మురళీశర్మ, నాగార్జున, శివాలయం అర్చకులు పాల్గొన్నారు.

## వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం : ఎమ్మెల్యే



చిల్లకూరు, డిసెంబర్ 7 ప్రభాతవార్త: తిప్పగుంటపాళెం ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేలా వంతెన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఈ మేరకు సీఎం చంద్రబాబుకు నివేదిస్తామని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలిపారు. చిల్లకూరు మండలంలో జలదిగ్బంధంలో చిక్కుకున్న తిప్పగుంటపాళెం గ్రామంలో ఆయన పర్యటించారు. చిల్లకూరు మండలంలో జలదిగ్బంధంలో గత ఐదు రోజులుగా ఉన్న తిప్పగుంటపాళెం గ్రామానికి ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ బోటులో వెళ్ళారు. అక్కడి ప్రజలతో మాట్లాడారు. వర్షాలకు తాము పడ్డ అవస్థలు అన్నీ వారు వివరించారు. టిడిపి నాయకుల సాయంతో స్థానికులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ భారీ వర్షాలు తగ్గుముఖం పట్టినా ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తానంకి నానాజీ, రాజశేఖర్‌రెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, జానకిరామిరెడ్డి, లీలావతి, సుప్రజ, చిరంజీవి, పట్టాభిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## అసాంఘిక కార్యకలాపాలు పాల్పడే వారిపై చర్యలు



వెంకటగిరి, డిసెంబర్ 7 ప్రభాతవార్త: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని సిఐ ఏవి రమణ హెచ్చరించారు. వెంకటగిరి పట్టణంలోని టిట్కో గృహాల వద్ద కార్డెన్ సర్చ్ నిర్వహించారు. టిట్కో గృహాల వద్ద పలు రకాల అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తమకు సమాచారం వస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, డి.ఎస్.పి గీతా కుమారి ఆదేశం మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి ఎస్సైలు ఏడుకొండలు, కామినేని గోపి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలకు నెలవుగా స్థూపం




సూళ్లూరుపేట, డిసెంబర్ 7 ప్రభాతవార్త: సూళ్లూరుపేట ఆర్అండ్‌బి రోడ్డులో రైల్వే ఫీడర్స్ రోడ్డుకు వెళ్లే మార్గంలో నడిబొడ్డులో నిర్మించిన స్థూపం అలంకారప్రాయంగా మారి ప్రమాదాలకు నెలవుగా ఉంది. గత నాలుగేళ్ల క్రితం ఇదే స్థూపాన్ని పట్టణంలో దాహార్తి తీర్చేందుకు ప్రత్యేకంగా కేటాయించిన నిధులతో పూర్తి చేసి అందుకు చిహ్నంగా ఆవిష్కరించాలని తలపెట్టారు. కానీ ఆ ప్రాజెక్టు మూలన పడటంతో నిర్మించి స్థూపం మాత్రం అలాగే వదిలేశారు. ప్రస్తుతం ఈ స్థూపం చుట్టూ ఆలనపాలన లేకపోవడంతో అటు రైల్వేస్టేషన్‌కు వెళ్లేవారు, ఇటు చెంగాళమ్మ దేవస్థానానికి బస్టాండ్ వైపు వెళ్లే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ స్థూపాన్ని శాశ్వతంగా తొలగించడమా, లేదా ఎత్తు తగ్గించి ప్రమాదాలను అరికట్టే చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## హైయ్యర్ పెన్షన్ వర్తింపజేయాలి




గూడూరు, డిసెంబర్ 7 ప్రభాతవార్త : హైయ్యర్ పెన్షన్ 2014 ముందు రిటైర్డ్ కాబడిన ఆర్టీసీ కార్మికులందరికీ వర్తింపజేయాలని ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. గంగాధర్ డిమాండ్ చేశారు. ఆదివారం గూడూరులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో రెండవ మహాసభ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గూడూరు డివిజన్ అధ్యక్షులు బి.వి.రమణయ్య అధ్యక్షతన జరిగిన, ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.గంగాధర్ పాల్గొన్నారు. గూడూరు డివిజన్ సమస్యల పైన కార్యదర్శి కె.వి నారాయణ మాట్లాడుతూ గూడూరు డివిజన్‌లో పెన్షనర్లు అనుభవిస్తున్న సమస్యల గురించి చర్చించారు. ఇపిఎస్ పెన్షన్ రూ.9000లు, డి.ఏ సాధన, చట్టపకారం గ్రాడ్యుయటి సాధన, రిటైర్మెంట్ కార్మికులందరికీ తెల్ల రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ పథకాలు వర్తింపజేయాలి.అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జి.జె.గోపి, గౌరవ సలహాదారుగా ఎం.శేషయ్య, అధ్యక్షులుగా బి.వి.రమణయ్య, ఉపాధ్యక్షులు ఎస్. రత్నం, ఉదయ భాస్కర్, డి.తిరుపాలు, కె. వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి కె.వి.నారాయణ రావు, సహాయ కార్యదర్శి కె.రాజయ్య, పి.మనోహరం, నాగూరయ్యా, టి.విజయలక్ష్మి, ట్రెజరర్‌గా వై. హరినాథ్, కమిటీ సభ్యులు సి.హెచ్. పెంచలయ్య, కె.తిరుపతమ్మ, కే.రమణమ్మ, వి.గిరిలను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశానికి నెల్లూరు జిల్లా కార్యదర్శి ఎంఆర్‌రెడ్డి, గౌరవ సలహాదారులు శంకరయ్య, చంద్రమౌళి, వి.పి. నరసింహా రెడ్డి, రామసుబ్బయ్య, తిరుపతి డివిజన్ రాష్ట్ర కార్యదర్శి బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి జ్యోతుల గ్రామోత్సవం



సూళ్లూరుపేట, డిసెంబర్ 7 ప్రభాతవార్త: శ్రీ అయ్యప్ప జ్యో తుల 27వ వార్షికోత్సవ గ్రామో త్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 18 మెట్లకు పడికట్ల పూజను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఉదయం విఘ్నే శ్వర పూజతో స్వామివారికి నెయ్యాభిషేకం చేశారు. సాయ ంత్రం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారికి ముందుగా జ్యోతులను చేతబూని మహిళలు పెద్దసంఖ్యలో గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్ఎస్ ఛైర్మన్ ఎజి కిషోర్, టిడిపి నేతలు పార్థసారధి, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, అయ్యప్ప భక్త బృందానికి చెందిన కె.లీలామోహన్‌రెడ్డి, చంద్రమౌళిరెడ్డి, పాదర్తి రవీంద్రారెడ్డి, బి.రమేష్, చిలకా మోహన్‌కృష్ణ, సాయిప్రదీప్‌రెడ్డి, జివి సుబ్బారావు, ఎకె రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల కొరత భర్తీ చేయాలి

తడ, డిసెంబర్ 7 ప్రభాతవార్త: మండల పరిధిలో పూడి కుప్పం, కాదలూరు, వేనాడు భీములవారిపాలెం గ్రామాలలోని పాఠశాలలకు ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందని ఉపాధ్యాయుల కొరత తీర్చాలని లేదా విద్యా వాలంటీర్లను ఏర్పాటు చేయాలని తడ యుటిఎఫ్ అధ్యక్షులు రాంబాబు ప్రధాన కార్యదర్శి రవికుమార్ కోరారు. సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానంలో మార్పులు తీసుకొచ్చింది అందులో భాగంగా ప్రాథమిక పాఠశాలకు విలీనం చేసింది.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ




కోట, డిసెంబర్ 7 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి సహాయ నిధి కింద కోట మండలం పలు గ్రామాల్లోని బాధితులకు ఆదివారం గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ క్యాంప్ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. నెల్లూరుపల్లి కొత్తపాలెంకు చెందిన నేదురుమల్లి స్వరూప, ఉల్లిపాయల మల్లికార్జున, కేశవరానికి చెందిన నాగార్జున, కొక్కుపాడుకు చెందిన ఆదెయ్యకు తిన్నెలపూడికి చెందిన రాయపు ఉషా, మద్దాలి గ్రామానికి చెందిన రామానాయుడు సీయం సహాయ నిధి కింద చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్, నెల్లూరుపల్లి కొత్తపాలెం జలసంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, కేశవరంకు చెందిన కోటి తదితరులు పాల్గొన్నారు.

## విద్యానగర్‌లో రక్తదాన శిబిరం



కోట, డిసెంబర్ 7 ప్రభాతవార్త : మండలంలోని విద్యానగర్‌లో ఆదివారం ఎంవి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాప్రదాత ముప్పవరపు వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మి జ్ఞాపకార్థం మిస్టర్ కార్ వాష్ సెంటర్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని పలగాటి సాయిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీలామోహన్‌కృష్ణ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ఎంతోమందికి ప్రాణం పోస్తున్నారని పేర్కొన్నారు. మెడిపల్స్ రక్తనిధి వారు రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంవి రావు ఫౌండేషన్ ఛైర్మన్ ముప్పవరపు లీలామోహన్‌కృష్ణ, కార్యదర్శి విజయలక్ష్మి, వేమారెడ్డి షనీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌వి ఫౌండేషన్‌చే ప్రతిభా పురస్కారాలు

కోట, డిసెంబర్ 7 ప్రభాతవార్త: కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల్లో 2026లో 10వ తరగతిలో ప్రతిభ చూపే విద్యార్థులకు ఆర్‌వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగదు పురస్కారాలు ఇవ్వడం జరుగుతుందని ఆర్‌వి ఫౌండేషన్ ఛైర్మన్ ఎంబేటి వెంకటకృష్ణయ్య తెలిపారు. ఆయన ఆదివారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ ప్రథమ బహుమతి రూ.5 వేలు ఇస్తామన్నారు. 8, 9 తరగతులు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అంబేద్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రథమ బహుమతి రూ.3వేలు, ద్వితీయబహుమతి వెయ్యిరూపాయలు ఇస్తామని తెలిపారు.

**ఎమ్మెల్యే రామకృష్ణ జోక్యంతో**

## గూడూరు-వెంకటగిరి రోడ్డుకు మోక్షం



బాలాయపల్లి, డిసెంబరు 7 ప్రభాతవార్త : గూడూరు–వెంకటగిరి రహదారి పనులు ఏడేళ్లుగా అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాలు కురుస్తుండడంతో రహదారి గుంటల మాయంగా మారి ప్రయాణం ప్రజలకు భారంగా మారింది. వినతులు, ఫిర్యాదులు చేసినా పనుల మీద పురోగతి కనిపించలేదు. ఈ పరిస్థితి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి నీకు ఒక ప్రజలు తీసుకొని వచ్చారు. కాంట్రాక్టర్‌ను నేరుగా పిలిపించి పనులను మొదలుపెట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. లేకుంటే కాంట్రాక్ట్ ని రద్దు చేసే వేరే వారికి ఇస్తామని తెలిపారు. ఇప్పుడు పనులు మొదలుపెట్టండి లేదంటే బ్లాక్‌లిస్టు తప్పదు అని హెచ్చరించారు. ఎమ్మెల్యే హెచ్చరికతో కాంట్రాక్టర్ మళ్లీ పనులు మొదలుపెట్టారు. ఆగిపోయిన రోడ్ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. రాబోయే రోజుల్లో రహదారి పూర్తయితే ప్రయాణ సౌలభ్యంతో పాటు, అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే దూకుడు పెంచారని ప్రజలు భావిస్తున్నారు.

## టిడిపి రాష్ట్ర అధ్యక్షుడును కలిసిన ఏఎంసీ ఛైర్మన్



వెంకటగిరి, డిసెంబర్ 7 ప్రభాతవార్త: రాష్ట్ర టిడిపి అధ్యక్షులు పళ్ళ శ్రీనివాసరావును ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాథం మర్యాదపూర్వకంగా కలిశారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావును సత్కరించి ఆయనకు వెంకటగిరి స్వీట్ ప్యాకెట్ను అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏఎంసీ ఛైర్మన్‌లకు విజయవాడలో జరిగిన సమావేశానికి శ్రీకాళహస్తి ఏఎంసీ ఛైర్మన్ రంగనేని చెంచయ్య నాయుడు.

## సీఎం సహాయనిధి పేదలకు భరోసా




గూడూరు, డిసెంబర్ 7 ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన బాధితులకు సీఎం సహాయనిధి ద్వారా చేయూత అందిస్తున్నామని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి కింద మంజూరైన నగదు చెక్కులను ఆయన చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ చేతుల మీదుగా సీఎం సహాయనిధి కింద మంజూరైన 23 లక్షల 74 వేల 944 రూపాయల నగదు చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, శివ కుమార్, రహీమ్, బిల్లు చెంచు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ విగ్రహం నిర్మాణానికి విరాళం

నాయుడుపేట రూరల్, డిసెంబర్ 7 ప్రభాతవార్త: పట్టణంలోని సీఎస్ తేజ సెంటర్ వద్ద ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా విగ్రహం నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ అత్తికాయల సుబ్రహ్మణ్యం యాదవ్ రూ.50 వేలు నాయుడుపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ రఫీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుంటూరు లక్ష్మయ్య, కోట్లపాటి గాంధీనాయుడు, వెంకటసుబ్బ నాయుడు, సిరివెళ్ల మునిరాజా, మునిబ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## భవిత స్కూల్లో దివ్యాంగుల దినోత్సవం



సూళ్లూరుపేట, డిసెంబర్ 6 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని భవిత స్కూల్లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సహకారంతో బహుమతులు అందజేశారు. జిల్లాస్థాయి దివ్యాంగుల ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఇఓ శీనయ్య సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. అనంతరం దివ్యాంగులకు స్వీట్లు పంపిణీ చేశారు. అశోక్, లలిత, భాస్కర్, నరేష్, బాలికల హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు మృదుల తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామిముల బస్సు బోల్తా

**- ఐదు మందికి స్వల్ప గాయాలు**

చిల్లకూరు, డిసెంబర్ 7 ప్రభాతవార్త: చిల్లకూరు జాతీయ రహదారిపై అమరావతి హోటల్ ఎదురుగా అయ్యప్ప భక్తుల బస్సు బోల్తా పడిందిన సంఘటన రైటర్ సత్రం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. అదుపు తప్పి బోల్తా పడ్డ శౌర్యన్ ట్రావెల్ బస్సు బస్ నెంబర్ (ఎన్ఎల్7బి0494) గల 35 మంది భక్తులతో గుంటూరు నుండి శబరిమలైకి వెళ్తున్న బస్సును ముందు వెళుతున్న లారీ టైరు పంచర్ అవడంతో లారీ ఎడమవైపుకు రాగా ఎడమ వైపు వస్తున్న శౌర్యన్ ట్రావెల్ బస్సు అదుపుతప్పి బోల్తా పడినట్లు సమాచారం. చిల్లకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మోస్ట్ వాంటెడ్ అంతరాష్ట్ర నేరస్తుడు అలెక్స్ అరెస్టు

**- యువతులను కిడ్నాప్ చేసి లైంగిక వేధింపులు- గంజాయి, డ్రగ్స్ అక్రమార్కుల నుండి నెల వారి మమూళ్ళు వసూలు- ఇతనిపై తమిళనాడు రాష్ట్రంలో 50కి పైగా కేసులు - డీఎస్పీ సాయినాథ్ వెల్లడి**



గుడిపాల, డిసెంబర్ 7 ప్రభాతవార్త: తమిళనాడు రాష్ట్రంలో మోస్ట్ వాంటెడ్ అంతర్‌రాష్ట్ర నేరస్తుడు అలెక్స్(35)ను ఆదివారం గుడిపాల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డిసెంబ్ 3వ తేదీన అనుపు ఎస్టీ కాలనీకి చెందిన ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అలెక్స్‌పై గుడిపాల పోలీసులు అత్యాచారం కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ మేరకు గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్ ఆదివారం అలెక్స్‌ను తుమ్మిదిన్నెపాళెం క్రాస్ వద్ద నిందితుడు అలెక్స్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ ఆదివారం గుడిపాల పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వెల్లడిస్తూ 2010 సంవత్సరంలో తొలి నేరం చేసిన అలెక్స్ జైలుకు వెళ్ళి వచ్చి అప్పటి నుండి దొంగతనాలు, దోపిడిలు, దారి దోపిడిలు, హత్యలు, హత్యాయత్నాలు, గంజాయి, డ్రగ్స్, కొట్లాట కేసుల్లో పాల్గొంటూ కరుడుగట్టిన నేరస్తుడిగా మారాడు. తమిళనాడు కాట్పాడి పోలీసు స్టేషన్‌లో అలెక్స్‌పై రౌడీషీట్ వుందని, 2018 గ్యాంగ్ వార్ నేపథ్యంలో హత్యాయత్నం నుండి తప్పించుకున్న అలెక్స్ నాలుగు రోజుల్లోనే ప్రత్యర్థి గ్యాంగ్‌కు చెందిన వ్యక్తిని హతమార్చాడు. ప్రస్తుతం అలెక్స్‌పై తమిళనాడు రాష్ట్రంలోని పలు స్టేషన్లలో 50 కేసులు నమోదై వుండగా చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం ఒక కేసు నిర్ధారణ అయ్యింది. 2023లో జైలు నుండి విడుదలైన అలెక్స్ పోలీసుల నుండి తప్పించుకోవడానికి గుడిపాల మండలంకు చేరుకుని అనుపు ఎస్టీ కాలనీకి చెందిన దీపక్ కుటుంబంతో పరిచయం పెంచుకుని, అతని కుమార్తెపై బలవంతపు ప్రేమ పేరుతో బెదిరింపులకు పాల్పడి అడవిలోకి తీసుకెళ్ళి గత సంవత్సరకాలంగా అత్యాచారానికి పాల్పడినట్లు వెల్లడైంది. గత నెలలో బాధితురాలిని మోటర్‌సైకిల్‌పై అపహరించి ఆమె తల్లిదండ్రులు, తమ్ముడిపై కత్తితో దాడి చేసి పెప్పర్ స్ప్రే ఉపయోగించి వారం రోజుల పాటు యువతిని మామిడి తోటలో నిర్బంధించి పలుమార్లు అత్యాచారం చేశాడు. ఆపై ఆ యువతిని ఇంటి వద్ద వదలి వెళ్ళి, మళ్ళీ దాడి చేయడానికి వెళ్తున్న అతనిపై నిఘా వుంచిన పోలీసులు అలెక్స్‌ను అరెస్టు చేశారు. కరుడుగట్టిన నేరస్తుడైన అలెక్స్‌ను అరెస్టు చేసిన గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్‌ను ఎస్పీ తుషార్ దూడి అభినందించారు.

## పరశురామేశ్వరునికి ప్రత్యేకాలంకారం: భక్తుల రద్దీ





ఏర్పేడు,(శ్రీకాళహస్తిరూరల్), డిసెంబర్ 7 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వ రునికి ఆదివారం ఆలయ వేదపండితులు వంశీ శర్మ ప్రత్యేకాలంకారంతో ఆకట్టుకునే రీతిలో ముస్తాబు చేసారు.ఈ నేపథ్యంలో ఆదివారం ఆలయానికి భక్తులు అత్యధిక సంఖ్యలో హాజరయ్యారు. పాపానాయుడుపేట పరిసరాల్లోనే కాకుండా తిరుపతి,శ్రీకాళహస్తి నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వచ్చిన భక్తులకు ఆలయం తరఫున మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయటంతో అక్కడే భక్తులు బస చేస్తున్నారు.ఆలయ ఆవరణను మాజీ ఛైర్మెన్ బత్తల గిరినాయుడు, ఆలయ ఇఒ రామచంద్రారెడ్డిలు పట్టుదలగా సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. దాంతో ఆలయానికి భక్తితో కొందరు ఆహ్లాదానికి మరి కొందరు ఇక్కడకు వస్తున్నారు.వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు మధ్యాహ్నం భోజనంతో పాటు ఉచిత ప్రసాదాలను కూడా ఏర్పాటు చేయటంతో భక్తులు సంతృప్తిగా ఉన్నారు.

## కాణిపాకం ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా!



తవణంపల్లె, డిసెంబర్ 7 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి ఆలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా తన వంతు కృషి చేస్తానని పాలక మండలి సభ్యులు సరకల్లు కత్తి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాణిపాకంలో ఆలయ పాలక మండలి ఆత్మీయ అభినందన సభ అత్యంత ఘనంగా జరిగింది. ఈసందర్భంగా కత్తి సుధాకర్‌రెడ్డి, సరకల్లు సర్పంచ్ కత్తి సతీష్‌రెడ్డిల ఆధ్వర ్యంలో ఆదివారం సుమారు వంద కార్లుతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన స్వగ్రామమైన సరకల్లు నుండి కాణిపాకం వరకు ర్యాలీగా వెళ్ళి ఆత్మీయ అభినందన సభలో పాల్గొన్నారు. ఈమేరకు ర్యాలీలో గాజులపల్లె, అరగొండ, తవణంపల్లె తదితర ప్రాంతాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కత్తి సుధాకర్‌రెడ్డికి ఘన స్వాగతం పలుకుతూ పూలమాలలో ఘనంగా సత్కరిస్తూ అభినందనలు తెలిపారు. ఈమేరకు టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, క్లస్టర్ ఇన్‌చార్జిలు ప్రవీణ్, మోహన్ నాయుడు, కో–కన్వీనర్ కంప్యూటర్ శివ, రైతు నాయకులు జయచంద్రచౌదరి తదితరులు ఘనంగా సత ్కరించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా కత్తి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాణిపాకం ఆలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా తన వంతు కృషి చేస్తానని తెలిపారు.ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులకు సౌకర్యాల కల్పనకు తనవంతు కృషి చేస్తామన్నారు.

## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను: జిల్లా కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, డిసెంబర్ 7 ప్రభాతవార్త : మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు.అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అలాగే నేడు సోమవారం తిరుపతి కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్‌ను వాట్సాప్‌లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వినూత్నన జాతర చప్పరాల తయారీకి కుస్తి

### -పురాతన కాలం నాటి సంప్రదాయంతో జాతర



వంద సంత్సరాలకు ముందు జాతరలో రాజా బహాదూరు నాయినం వారు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 7 ప్రభాతవార్త: దక్షిణకైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తిలో నిర్వహించే ఏడుగంగమ్మల జాతరకు ముస్తాబు అవుతుంది. ఈనెల 9,10 తేదుల్లో ఏడుగంగమ్మల జాతర నిర్వహించుటకు తేదీలను ఖరారు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పురాతన కాలం నాటి సంప్రదాయం, పద్ధతిలో జాతర నిర్వహణకు కమిటి నిర్వాహకులు నిర్ణయించారు. పూర్వ కాలం ముత్యాలమ్మగుడివీధిలోని గంగమ్మ రాయి నుంచి పసుపు మద్దులను చాటల్లో పెట్టుకొని స్థావరాల వద్దకు చేర్చి పూజలు నిర్వహించే వారని చెబుతున్నారు. ఈ ఏడాది సప్పరాల సంస్కృతినిఈ తరం పట్టణ వాసులు చూడనున్నారు. ఓ వైపు వర్షం హెచ్చరికలు ఉన్నా నిర్వాహకులు ఖాతరు చేయకుండా ముస్తాబులకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి జాతర చాటింపు జరిగింది. అయితే స్థావరాల వద్ద పందిళ్ళు వెలుస్తున్నాయి. సాధారణంగా ఏ ప్రాంతంలో అయిన ఒకే గంగమ్మను ప్రతిష్టించి పూజలు నిర్వహించటం ఆనవాయితి. కాని శ్రీకాళహస్తిలో ఏడుగంగమ్మల్ని ఏడు ప్రాంతాల్లో ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తారు.

**జాతర చాటింపు-మాల ధారణ:**

శ్రీకాళహస్తి ఏడుగంగమ్మల జాతర చాటింపును ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన యువకులు గంగమ్మ మాల ధారణ జరిపారు.నాలుగు రోజుల పాటు ఎర్రటి దుస్తులు ధరించి నియమనిష్టలతో గడుపుతారు.

**భక్తి శ్రద్ధలతో జాతర చాటింపు:**

శ్రీకాళహస్తిలో నిర్వహించే ఏడుగంగమ్మల జాతరకు ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత చాటింపు నిర్వహించారు. పట్టణం సద్దుమణిగాక నిర్వాహకులు ఈ కార్యక్రమాల్ని చేపట్టారు. స్థానిక సంప్రదాయం మేరకు, శాస్త్రోక్తంగా చాటింపు ప్రారంభించారు. పొలి చల్లుతూ చాటింపు చేశారు. పట్టణ నిర్మాణంలో నాటి రాజులు సరిహద్దులుగా తెట్టురాళ్ళను ఏర్పాటు చేశారు. ఇటు బహాదూరుపేట, కొత్తపేట, ముత్యాలమ్మగుడివీధి, సన్నిధివీధి, జయరామారావువీధి ప్రాంతాల్లో తెట్టురాళ్ళను ఏర్పాటు చేశారు. జాతర చాటింపు సందర్భంగా ఇక్కడ పూజలు నిర్వహించటం ఆనవాయితి. దాంతో జాతర కార్యక్రమాలు ప్రతి ఏడాది నగరివీధిలోని గంగమ్మ రాయి వద్ద నుంచి చాటింపును ప్రారంభిస్తారు. తరువాత డప్పుల మోతతో దివిటీల వెలుగులో ఏడు చోట్ల కుంభం వేసి పొలి చల్లుకుంటూ సాగారు. దాంతో జాతర సంబరాలకు శ్రీకారం చుట్టారు.

## టోల్ ప్లాజా సిబ్బంది ఆగడాలను అడ్డుకునేదెవరు..?

**ప్రయాణాకుల పట్ల నానాటికీ పెచ్చరిల్లుతున్న దురుసుతనం**



చంద్రగిరి, డిసెంబర్ 7 ప్రభాతవార్త: గాదంకి టోల్ ప్లాజా సిబ్బంది ఆగడాలను అడ్డుకునేదెవరని ప్రయాణికులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పనపాకం పంచాయతీ పరిధిలో వున్నప్పటికీ గాదంకి పేరిట గుర్తించబడిన టోల్ ప్లాజా సిబ్బందిలో ఎవరినీ లెక్కపెట్టే పరిస్థితి ఈసుమంతైనా కనిపించదు. ఈ మార్గంలో ఉద్యోగరీత్యా ప్రయాణించే స్థానికులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రయాణికుల పట్ల టోల్ ప్లాజా సిబ్బంది ప్రవర్తనా తీరు నానాటికీ పెచ్చరిల్లిపోతున్నట్లు వాపోతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఓ ప్రభుత్వ ఉద్యోగి స్వయంగా కారు నడుపుకుని వచ్చి తన ఐడి కార్డును టోల్ ప్లాజా సిబ్బందికి చూపించారు. అయితే కారులో అధికారులను బయటకువచ్చి కనబడమంటూ (అధికారిని డ్రైవర్‌గా గుర్తిస్తూ) వ్యంగ్యంగా మాట్లాడటంతో ఒక్కసారిగా షాక్ గురయ్యారు. తాను స్థానికుడనని చెప్పినప్పటికీ అయితేనేం కొమ్ములొచ్చాయా అంటూ మాట్లాడటం సిబ్బంది లెక్కలేనితనాన్ని చెప్పకనేచెబుతున్నది. ఒక సాధారణ టోల్ ప్లాజా సిబ్బంది తీరు ఈ విధంగా వుందంటే ఇంతటి ధైర్యం ఏవిధంగా వచ్చిందనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. గతంలో అనేక పర్యాయాలు ప్రజలతో పాటు రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రయాణికులు, శ్రీవారి భక్తులు ఇక్కడ ధర్నా చేసిన సందర్భాలు అనేకం వున్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేస్తే తమ పనులకు ఇబ్బందులు తలెత్తుతాయనే కారణంతో మౌనంగా వెళ్ళిపోతున్నారు. ఇకనైనా చంద్రగిరి పోలీసులు, పాకాల పోలీసులు టోల్ ప్లాజాపై దృష్టి సారించి ప్రయాణికులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్థానికుల పట్ల దురుసుగా ప్రవర్తించే వారితో పాటు ఆ సమయంలో డ్యూటీలో వున్న ఇన్‌చార్జ్‌లపై సైతం కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వివిపిలకు, స్థానికులకు, ప్రభుత్వ ఉద్యోగులకు, మీడియా ప్రతినిధులకు, ప్రత్యేక ప్రవేశాన్ని కల్పించాలని కోరుతున్నారు.